# విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్
గుంటూరు, పల్నాడు

శుక్రవారం 11 ఏప్రిల్ 2025 8 పేజీలు


## హోంగార్డ్సను స్వరాష్ట్రానికి తీసుకురావాలి

**సీఎంకు ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సుభాని వినతి**

**విశాలాంధ్ర-మంగళగిరి :** రాష్ట్ర విభజన సమయంలో అన్ని శాఖలకు సంబంధించిన ఉద్యోగులను వారి స్వరాష్ట్రంలో ఉద్యోగం చేసుకునే అవకాశం ప్రభుత్వాలు కల్పించాయని, కానీ ఆంధ్రప్రదేశ్ స్థానికతకు చెంది తెలంగాణలో హోంగార్డులుగా ఉద్యోగం చేస్తున్న వారిని మాత్రం అప్పటి నుంచి ఇప్పటివరకు ఏ ప్రభుత్వాలు పట్టించుకోలేదని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. వారిని స్వరాష్ట్రానికి తీసుకురావాలని కోరుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఆయన కార్యాలయంలో గురువారం కలిసిన సుభాని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుభాని మాట్లాడుతూ ఉద్యోగం తెలంగాణలో కుటుంబం ఆంధ్రాలో ఉండడం వలన వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పెద్ద వయస్సు కలిగిన వారి తల్లిదండ్రులు అయితే చూసే దిక్కులేక మానసిక ఆందోళనకు గురవుతున్నారని సీఎంకు వివరించారు. హోంగార్డ్స్ పిల్లలు తెలంగాణలో చదువుకోవడం వల్ల ఆంధ్రప్రదేశ్ స్థానికతను కోల్పోయే అవకాశం ఉందని చంద్రబాబు దృష్టికి తీసుకువచ్చారు. అలాగే తెలంగాణ స్థానికతకు చెందిన హోంగార్డ్స్ మన రాష్ట్రంలో ఉద్యోగం చేస్తున్నారని, వారు కూడా తెలంగాణకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అదేవిధంగా రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకువచ్చి యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఆయన కోరారు. ఆయా అంశాలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని సభాని తెలిపారు.

## గ్యాస్ ధరలను తగ్గించాలి

**- ఆంధ్రప్రదేశ్ మహిళ సమాఖ్య డిమాండ్**

**- రోడ్డుపై కట్టెల పొయ్యిపై వంటలు చేసి నిరసన**

**విశాలాంధ్ర-విజయవాడ:** కేంద్ర ప్రభుత్వం పెంచిన ధరలపై గ్యాస్ మంటలు రోజురోజుకు ఉధృతం అవుతున్నాయి. సామాన్య ప్రజలపై పడిన భారాన్ని వెంటనే తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ మహిళ సమాఖ్య విజయవాడ నగర సమితి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం కళ్ళు తెరిపించే విధంగా గురువారం నగరంలోని పైపుల్ రోడ్ సెంటర్లో కట్టెల పొయ్యిపై ఆహా రం వంట చేసి రోడ్డుపైన వండిన ఆహారాన్ని తిని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య విజయవాడ నగర అధ్యక్ష కార్యదర్శులు ఓర్సు భారతి, పంచదార్ల దుర్గాంబ మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు అనేక రకాలుగా వాగ్దానాలు చేశారు. ముఖ్యంగా మేము అధికారం లోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్‌లో దీపం పథకం కింద ప్రతి ఇంటికి ఒక సంవత్సరానికి మూడు సిలిండర్లు ఇస్తామని వాగ్దానం చేసినటువంటి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి

మిగతా 2 లో ...

### దేశానికి రోల్ మోడల్‌గా

## మంగళగిరి వెయ్యి పడకల ఆసుపత్రి

**13న శంకుస్థాపన చేయనున్న మంత్రి లోకేష్**

**విశాలాంధ్ర బ్యూరో- అమరావతి :** మంగళగిరి ప్రజల 30 ఏళ్ల కల వంద పడకల ఆసుపత్రి నిర్మాణం. తనను 91వేల భారీ మెజార్టీతో గెలిపించిన మంగళగిరి ప్రజల మూడు దశాబ్దాల కలను నెరవేర్చేందుకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సిద్ధమయ్యారు. అత్యాధునిక వసతులతో దేశానికే రోల్ మోడల్‌గా ఆసుపత్రి నిలిచేలా ఇప్పటికే ప్రణాళికలు రూపొందించారు. మంగళగిరి సమీపంలోని చినకాకాని వద్ద నిర్మించనున్న వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి ఈ నెల 13వ తేదీన మంత్రి లోకేష్ శంకు స్థాపన చేయనున్నారు. ప్రతిష్ఠాత్మ కంగా నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రిని కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా, దేశంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దాలని మంత్రి నారా లోకేష్ ఇప్పటికే అధికారులకు దిశానిర్దేశం చేశారు. భవన సముదాయాలు, ఆసుపత్రిలో అత్యాధునిక సదుపాయాల కల్పన విషయంలో పలుమార్లు అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. వైద్యులు, సిబ్బంది ప్రశాంత వాతావరణంలో పనిచేసేలా చూడాలన్నారు.

మిగతా 2 లో ...

## చెన్నకేశవుని బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

**విశాలాంధ్ర-మాచర్ల :** పట్టణం లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయంలో ప్రారంభంకానున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా కలెక్టర్ పి.అరుణ్ బాబు, ఎస్పీ కంచి శ్రీనివాస రావు తో కలిసి గురువారం చెన్నకేశవ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించి సంబంధిత అధికారుల నుండి వివరాలు సేకరించారు. ఈ నెల 17న తారీఖున నిర్వహించనున్న రథోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన రథాన్ని పరిశీలించారు. రథోత్సవానికి తరలిరానున్న భక్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేసవి దృష్ట్యా వచ్చిన భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశం చారు. రెవెన్యూ డివిజన్ అధికారి మురళీకృష్ణ, మండల ప్రత్యేక అధికారి గబ్రు నాయక్ మండల రెవెన్యూ అధికారి కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

### అప్పుల వంకతో సంక్షేమ పథకాలు

## అమలు చేయకపోవటం దుర్మార్గం

**నిరసన తెలుపుతున్న పీఓడబ్ల్యూ మహిళలు**

**విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) :** సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన టిడిపి కూటమి ప్రభుత్వం పది నెలలు దాటుతున్నా సంక్షేమ పథకాల హామీలు అమలు చేయక పోవడాన్ని నిరసిస్తూ సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల మహిళా సంఘం పీఓడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆర్. గంగాభవాని డిమాండ్ చేశారు. విజయవాడ నగర కమిటీ ఆధ్వర్యంలో గురువారం ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బిజెపి కూటమి నాయకులు రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను సంక్షేమ పథకాలను అమలు చేసే వైపుగా దృష్టి పెట్టకుండా కేవలం బ్రాందీ షాపుల వాటాలు పంచుకోవడంపైనే దృష్టి పెట్టారన్నారు.ఎవరికి ఎన్ని షాపులు కావాలో పంచుకొని ప్రజలను దోచుకుంటున్నారని విమర్శించారు. ఎన్నికలకు ముందు తల్లుల కోసం, పిల్లల కోసం, మహిళల కోసం, రైతుల కోసం, యువకుల కోసం, కార్మికుల కోసం ఇలా అన్ని వర్గాల ప్రజల కోసం నీకు ఇది నీకిది నీకిది అంటూ అనేక హామీలు గుప్పించిన చంద్రబాబు ఇప్పుడు అమాయకంగా ఖజానాలో డబ్బులు లేవని బుకాయించడం ప్రజలను దగా చేయడమే అన్నారు. పది నెలల కాలంలో రూ.1,50,000 కోట్లు అప్పులు చేశారని అయినా పథకాలు ఎందుకు చేయటం లేదని ప్రశ్నించారు. కాంట్రాక్టర్ల బిల్లుల పేరుతో కూటమి నాయకులు దోచుకోవటం జరుగుతుందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వ ఈ దుర్మార్గాలను, మోసాలను ప్రజల గ్రహిస్తూనే ఉన్నారని, త్వరలోనే ప్రజలంతా ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. పీఓడబ్ల్యూ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు పి.పద్మ మాట్లాడుతూ మహిళలపై చేయి వేయాలంటే భయపడే విధంగా చర్యలు తీసుకుంటామని ఎన్నికలకు ముందు ప్రగల్భాలు పలికిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇప్పుడు ఏమైపోయారో అర్థం కావడం లేదన్నారు. రాష్ట్రంలో చిన్న పిల్లల మీద మహిళల మీద అత్యాచారాలు అఘాయి త్యాలు అంతులేకుండా జరుగుతున్న పవన్ కళ్యాణ్ నోరు మెదకపోవ డాన్ని తప్పుపట్టారు. అధికారం కోసం సుగాలి ప్రీతి అంటూ 33 వేల మహిళల మిస్సింగ్ అంటూ తప్పుడు విమర్శలు, వాగ్దానాలు చేయడం సిగ్గుచేటని విమర్శి ంచారు. రాష్ట్రంలో మహిళలకు నెలకు రూ.1500లు ఏడాదికి రూ.18వేలు ఇస్తామన్నారని ఒక సంవత్సరం గడిచిపోయిందని గుర్తు చేశారు. గత బకాయిలతో కలుపుకొని ఆడబిడ్డ నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు, నెలకు 3000 భృతి గూర్చి పూదరగొట్టిన లోకేష్ ఇప్పుడు మంత్రులపై పెత్తనం కోసం, ప్రతిపక్షాలపై కక్ష సాధింపు చర్యలు కోసం తప్ప నిరుద్యోగుల గురించి పట్టించుకోవడంలేదని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా సూపర్ సిక్స్ ఇతర ఎన్నికల హామీలను అమలు చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కె. దుర్గ కమిటీ సభ్యులు లక్ష్మీ, దుర్గ, రాధ, సుజాత, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

(మొదటి పేజీ తరువాయి)

## గ్యాస్ ధరలను తగ్గించాలి

వచ్చిన పది నెలల కాలంలోనే సిలిండర్ పై 50 రూపాయలు పెంచి సామాన్య ప్రజలకు సౌకర్యాలను దూరం చేసే విధంగా ఈ ప్రభుత్వం వ్యవహరిస్తుంది. పేదల పక్షాన ఉంటాము మరి ముఖ్యంగా వారికి కావాల్సినటువంటి సదుపాయాలతో పాటు మేము ఇచ్చేటువంటి సూపర్ సిక్స్ లో హామీలను వెంటనే అమలు చేస్తామని అన్నారు కానీ మాటలకే పరిమితం అవుతున్నాయి కానీ అమలు పరచడంలో శూన్యం మరి ముఖ్యంగా ప్రచార లో ఉన్న ఆర్భాటం ప్రజలకు అందుబాటులోకి దూరమవుతున్న పథకాలు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న సిపిఐ నగర కార్యదర్శి వర్గ సభ్యులు భాస్కరరావు, స్థానిక నాయకులు లింగాబత్తుల శివ కుమార్, కె.ఆదినారాయణ, గురవయ్య,కార్తీక్,, నగర మహిళా సమాఖ్య నాయకులు నిలావు భాగ్యలక్ష్మి, .నాగూర్, బి.మల్లేశ్వరి, నిర్మల, కన్నమ్మ , భాను, రాణి, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

## దేశానికి రోల్ మోడల్‌గా మంగళగిరి వెయ్యి పడకల ఆసుపత్రి

ఏడాదిలోగా ఆసుపత్రి నిర్మాణాన్ని పూర్తిచేయాలని గడువు విధించారు. 7.35 ఎకరాల్లో 1,15,000 చదరపు అడుగుల్లో అత్యంత విశాలంగా ఆసుపత్రి భవనాన్ని నిర్మించనున్నారు. ఆసుపత్రి అభివృద్ధికి రూ.52.20 కోట్లు వెచ్చించనున్నారు. ప్రస్తుతం జీ ప్లస్ వన్ విధానంలో ఆసుపత్రిని నిర్మించనున్నారు. ఆసుపత్రిలో మెడికల్, సర్జికల్, ఆర్థో, గైనిక్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్ విభాగాలను ఏర్పాటుచేయనున్నారు. వీటితో పాటు 3 ఆపరేషన్ థియేటర్లు, డయాలసిస్ సెంటర్, మంత్రి లోకేష్ సూచనల మేరకు తలసేమియా వార్డు, డీ అడిక్షన్ ఓపీ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. యువగళం పాదయాత్రలో మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఏరియా ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తానని నారా లోకేష్ హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గతేడాది అక్టోబర్ 23వ తేదీన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ విషయాన్ని కేబినెట్ దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి నారా లోకేష్ ప్రతిపాదనను మంత్రివర్గం ఆమోదించడంతో మంగళగిరి ప్రజల చిరకాల వాంఛ నెరవేరనుంది. 1986లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ మంగళగిరిలో ప్రభుత్వ ఆసుపత్రిని ప్రారంభించారు. కాలక్రమేణా ఆసుపత్రి నిరాదరణకు గురికావడంతో కేవలం ఓపీ సేవలకు మాత్రమే పరిమితమైంది. అనేక సంవత్సరాలుగా మంగళగిరి ఆసుపత్రిని వంద పడకల స్థాయికి పెంచాలంటూ ప్రజలు ప్రత్యేక కమిటీలుగా ఏర్పడి డిమాండ్ చేస్తున్నారు. వివిధ సందర్భాల్లో ఆసుపత్రిని అభివృద్ధి చేయాలని ఎంతో మంది పాలకులకు వినతి పత్రాలు సమర్పించారు. తాజాగా మంత్రి నారా లోకేష్ చొరవతో ఆసుపత్రి కల సాకారం కానుంది.

## హోమియో వైద్య సేవలు అభినందనీయం

విశాలాంధ్ర - ఘంటసాల : గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన హోమియో వైద్య సేవలు అందించడం ఎంతో అభినందనీయమని ఘంటసాల మాజీ సర్పంచ్ సంక నాగబాలసుబ్రహ్మణ్యేశ్వర రావు పేర్కొన్నారు. మండల కేంద్రమైన ఘంటసాల లోని చుందూరి అశోకరావు వేదశ్రీ ఐరన్ పెయింట్స్ షాపు నందు గంగా హోమియో స్టోర్స్ అండ్ క్లినిక్ నందు హోమియోపతి పితామహుడు డాక్టర్ "శామ్యూల్ హనీమెన్" 270 వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ సర్పంచ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు హోమియో వైద్యం చేరువ చేయడం గ్రామంలో గంగా హోమియో స్టోర్స్ అండ్ క్లినిక్ తక్కువ ఖర్చుతో వైద్యం అందించి, ఎలాంటి దుష్ఫలితాలు చూపని మంచి మందులను అందించడం ఎంతో అభినందనీయం అన్నారు. గంగా హోమియో స్టోర్స్ అండ్ క్లినిక్ అధినేత రాజ్ గోపాల్ ఆధ్వర్యంలో హైదరాబాద్ కేంద్రంగా ప్రధాన హోమియో స్టోర్స్ అండ్ క్లినిక్ నెలకొల్పి విజయవాడలో ఒక బ్రాంచి ద్వారా సేవలందిస్తూ గ్రామాల్లో కూడా హోమియో వైద్య సేవలను ప్రజలకు చేరువ చేసేందుకు ఘంటసాల గ్రామంలో కూడా ఏర్పాటు చేశామని ప్రతి ఒక్కరూ సద్వినియోగపరచుకోవాలన్నారు. ప్రతి గురువారం ప్రజలకు సేవలందించనున్నట్లు డాక్టర్ సాయి కిరణ్ వివరించారు. తొలిత డాక్టర్ శామ్యూల్ హనీమెన్ చిత్రపటానికి పూలదండ వేసి నివాళులర్పించారు. డాక్టర్లు గ్రామ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# సమాన అవకాశాలు కల్పించాలి : శ్రీనివాసరావు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రాష్ట్ర మున్సిపల్ ఉపాధ్యాయులకు జిల్లా పరిషత్ ఉపాధ్యా యులతో సమాన అవకాశాలు కల్పించాలని ప్రోగ్రెసివ్ మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సోమ రౌతు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం గాంధీనగర్ ప్రెస్‌క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2022 సం.లో మున్సిపల్ టీచర్స్ పరిపాలన, పర్యావరణ బాధ్యతలు స్కూల్ ఎడ్యు కేషన్‌కు అప్పగిస్తూ జీవో నెంబర్ 84 విడుదల చేశారని తెలిపారు. నాటి నుంచి మున్సిపల్ ప్రధానోపాధ్యాయులకు డిడిఓ అధికారాలు, అర కొర పదోన్నతులు తప్ప స్కూల్ ఎడ్యుకేషన్ తమకు ఏ మేలు చేయలేదన్నారు. సిక్స్ పాయింట్ ఫార్ములా ప్రకారం మల్టిపుల్ కౌన్సిల్ రద్దు అయినా ఇంకా కొనసాగిస్తున్నారని ఆరోపించారు. పరభుతవ తక్షణమే స్పందించి మున్సిపల్ ఎడ్యుకేషన్ యూనిఫైడ్ సర్వీసు రూల్స్ విడుదల చేసి బదిలీల చట్టం రూపొందించాలని, ప్రాథమిక పాఠశాలలను ఉన్నత పాఠశాలలు గా అప్ గ్రేడ్ చేయాలని, బాషా పండితుల సమస్యలు పరిష్కరించాలని, అంతర్ జిల్లా బదిలీలు చేపట్టాలని, పదోన్నతుల్లో 70:30 పాటించాలని, జీపీఎఫ్ ఖాతాలు ఏర్పాటు చేయా లని, మోడల్ స్కూల్స్ ప్రారంభం తదితర సమస్య లను పరిష్కరించాలని కోరారు. సమాఖ్య ప్రధాన కార్యదర్శి పోలిమెట్ల సుమంత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరకండ్ల శ్రీనివాసరావు, కొండూరు శ్రీనివాసరావు, తెనాలి పట్టణ కార్యదర్శి ఎం సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కారానికి ఉద్యమించాలి : కట్టా

విశాలాంధ్ర-పెడన: పెడన చేనేత సమస్యలా పరిష్కారానికి కార్మికులు ఉద్యమించాల్సిన అవ సరం ఎంతైనా ఉందని ఏపీ చేనేత కార్మిక సం ఘం రాష్ట్ర నాయకులు కట్టా హేమ సుందరరావు అన్నారు. ఏపీ చేనేత కార్మిక సంఘం వ్యవస్థాపక దినోత్సవాన్ని పట్టణంలోని సర్వోదయ సొసైటీ నందు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హేమ సుందరం మాట్లాడుతూ ముందుగా కార్మికులకు చేనేత వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. చేనేత కార్మి కులకు 200 యూనిట్ల ఉచిత కరెంటు అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడుకి విజ్ఞప్తి చేశారు. బూసం బాలసుబ్రమణ్యం, రావూరి వీరభద్రరావు, గుత్తి పూర్ణచంద్రరావు, పడవల కోటిలింగం, కుర్మా విగ్నేశ్వరరావు, రవీంద్ర, కట్టా మహేష్ పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

### ఆర్టీసీ డిపో ఎదుట కార్మికుల ధర్నా

విశాలాంధ్ర-ఉయ్యూరు : న్యాయమైన డిమాండ్ సాధన కోసం ఆర్టీసీ కార్మికులు గురువారం స్థానిక డిపో వద్ద ధర్నాకు పూనుకున్నారు. ఏపీఎస్ఆర్టీసీలో రాష్ట్రవ్యాప్తంగా 1/2019 సర్క్యులర్ అమలు పరచాలని, దీర్ఘ కాలంగా పరిష్కరింపబడని ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఉద్యోగుల సమస్యల పై నాయకులు మెమోరాండంలు ఇచ్చినప్ప టికీ యాజమాన్యం స్పందించని కారణం వలన నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు డిపో నందు గేట్ ధర్నా/ గేట్ మీటింగ్ నిర్వహించారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏఎస్‌రావు, డిపో కార్యదర్శి పి.ఎం.కృష్ణ, వైస్ చైర్మన్ పిచ్చియ్య, అసిస్టెంట్ సెక్రటరీ అరుణోదయ, కమిటీ మెంబర్ రంగమ్మ, గోవింద్, కండక్టర్లు డ్రైవర్లు గ్యారేజ్ సభ్యులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## రావెళ్ల కృష్ణసేవాసమితి సేవలు

విశాలాంధ్ర-చల్లపల్లి : రావెళ్ల కృష్ణసేవాసమితి నిర్వాహకులు రావెళ్ల ఉదయ్‌కుమార్ పుట్టినరోజు సందర్భంగా సేవాసమితి యువత గురువారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. చల్లపల్లి బస్టాండ్ సెంటర్, లక్ష్మీపురం ప్రధాన సెంటర్లలో 500 లీటర్ల మజ్జిగను ప్రజలకు పంపిణీ చేశారు. స్థానిక సీయోను వృద్ధాశ్రమంలో అనాథ వృద్ధులకు అన్నదానం చేశారు.

## పాములపాడులో రీ సర్వేను కలెక్టర్ పరిశీలన

విశాలాంధ్ర-పెదపారుపూడి : ప్రపంచ సర్వే దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలం లోని పాములపాడు రెవెన్యూ పంచాయతీ పరిధిలో భూమి రీ సర్వే జరుగుతున్న తీరును కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రి సర్వే సక్రమంగా నిర్వహించాలని ఎటువంటి తప్పులు, పొరపాట్లు లేకుండా చూడాల్సిన బాధ్యత రెవెన్యూ సిబ్బందిపై ఉందన్నారు. అంతకుముందు స్థానిక పంచాయతీ కార్యాలయంలో పట్టాభి సీతారామయ్య, చిత్రపటానికి పూల మాలలు వేసి ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం దోసపాడు సాగునీటి సంఘం అధ్యక్షుడు గుండపనేని శ్రీనివాసరావు (స్వామి), గ్రామస్తులు దగాని లెనిన్ బాబు, సర్పంచ్ వికృతి స్వాతి తదితరులు కలెక్టర్ బాలాజీని శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వై రంగారావు, రెవిన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: బీటెక్ మొదటి సంవత్సరంలో నాలుగు సబ్జెక్టులో ఫెయిల్ అయ్యాడని మనస్తాపం చెంది బీటెక్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన విజయవాడ ఇబ్రహీపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బాపట్ల జిల్లా అద్దంకి మండలానికి చెందిన కే.పవన్ కుమార్(20) కేతనకొండలోని ఆర్‌కే.ఇంజనీరింగ్ కళాశాలలో బీ.టెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మొదటి సంవత్సరం పరీక్ష ఫలితాల్లో నాలుగు సబ్జెక్ట్‌ల్లో ఫెయిల్ అయ్యాడు. మానసిక ఒత్తిడికిగురై మనస్తాపం చెందిన పవన్ కుమార్ హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తొటి స్నేహితులు చూసి వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రికలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇబ్రహీపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గర్భిణీలకు, బాలింతలకు జీవనాడీ అంగన్వాడీ

విశాలాంధ్ర-బంటుమిల్లి : అంగన్వాడీ కేంద్రాలు గర్భిణీలకు, బాలింత లకు, ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు జీవ నాడి లాంటివని బంటుమిల్లి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి ఎం సముద్రవేణి అన్నారు. మండల శివరూ నాగన్నచెరువు గ్రామపంచాయితీ లక్ష్మీపురం గ్రామంలో ఉన్న అంగన్వాడీ సెంటర్ నందు గురువారం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి ఎం సముద్రవేణి ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సముద్రవేణీ మాట్లా డుతూ గర్భవతులు మొదటి 1000 రోజుల సంరక్షణపై శ్రద్ధ వహించడం అంగన్వాడీ కేంద్రాల లక్ష్యమని, లబ్ధిదారుల స్వయంగా కేంద్రంలో వారి పేర్లు నమోదు చేసుకునే విధానం ప్రచారం చేయుట, సీఎం ఏఎం కార్యక్రమం ద్వారా పిల్లల్లో పౌష్టిక ఆహార లోపాన్ని నివారించడం, పిల్లలలో ఊబకాయాన్ని తగ్గించటానికి ఆరోగ్యకరమైన జీవన శైలి మొదలగు అంశాల గూర్చి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ రేవు నాగలక్ష్మి, గ్రామ మహిళ పోలీస్ షర్మిల, ఆరోగ్యశాఖ సిబ్బంది సంతోషమ్మ, శివపార్వతి, అంగన్వాడీ కార్యకర్తలు జె ఉషారాణి, టి ఎ ఎస్ వాణి, ఎన్ కృష్ణకుమారి, గ్రామ ఉపసర్పంచ్ పి ధర్మారావు, వార్డు మెంబర్ మౌనిక, గ్రామ పెద్దలు, బాలింతలు, గర్భవతులు పాల్గొన్నారు.

## మెగా కిడ్స్ కార్నివాల్‌లో అదరగొట్టిన ఏకత్వ కిడ్స్

విశాలాంధ్ర-నందిగామ: చిన్నారులు విలువైన సమ యాన్ని బాల్యాన్ని కోల్పోతే మళ్ళీ సాధించుకోలేరని ఏకత్వ కిడ్స్ డైరెక్టర్ శాంతి ప్రత్యూష అన్నారు ఇటీవల స్థానిక ఏకత్వ కిడ్స్ ప్లే స్కూల్ నందు ఏర్పాటుచేసిన మెగా కిడ్స్ కార్నివాల్ లో ఏకత్వ కిడ్స్ అద్భుత ప్రదర్శన ఇచ్చారని ఆమె పేర్కొన్నారు ఈ సందర్భంగా ఏకత్వ స్కూల్ మేనేజ్మెంట్ మాట్లాడుతూ నందిగామలోనే మొట్టమొదటిసారిగా ప్లే స్కూల్ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా మెగా కిడ్స్ కార్నివాల్ ఏర్పాటు చేయటం అందులో విద్యార్థులు ఆల్రౌండ్ డెవలప్మెంట్ తో పాటు ఆటపాటలు డాన్సులు, కేరింతలతో ఆహుతలను అలరించడం కేవలం ఏకత్వ కిడ్స్ కే సాధ్యమైందని అన్నారు ఇటీవల ఏకత్వ స్కూల్ నందు ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ డే సెలబ్రేషన్స్ నిర్వహించినట్లు తెలియజేశారు. నందిగామలో అనతి కాలంలోనే ఏకత్వ ప్లేస్ స్కూల్ నందు చిన్నారుల ఆటపాటల ను వారి నడవడికను గమనించిన పలువురు ఏకత్వ యాజమాన్యాన్ని చిన్నారులను అభినందిస్తున్నారు ఈ కార్యక్రమంలో అమరనేని రమేష్ బాబు, అమరనేని జ్యోతి,అమరనేని మనోజ్, సింధూర, అమరనేని కార్తీక్ విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## 12న జీ తెలుగులో డ్రామా జూనియర్స్ సీజన్ 8

విశాలాంధ్ర- విజయవాడ లబ్బీపేట : జీ తెలుగు డ్రామా జూనియర్స్ కొత్త సీజన్ 8 ఈ నెల 12న, ప్రారంభం కానుందని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. సంవత్సరాల నుంచి ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న డ్రామా జూనియర్స్ 8వ సీజన్‌తో మరోసారి ప్రేక్షకులకు వినోదం పంచేందుకు సిద్ధమైందన్నారు. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్‌లోని పిల్లల్లో దాగున్న నటనా ప్రతిభను వెలికి తీసే ఉద్దేశ్యంతో కొత్త సీజన్ని ప్రారంభి స్తోందన్నారు. ఈ షోను ఎవర్గ్రీన్ ఎనర్జిటిక్ యాంకర్ సుధీర్ హోస్ట్ చేయ నున్నారు. పిల్లల స్కిట్లకీ, సుధీర్ కామెడీ పంచులు, టైమింగ్ తోడైతే ప్రేక్షకులు కడుపుబ్బా నవ్వడం ఖాయమన్నారు. ప్రతిభ గల చిన్నారులను మరింత ప్రోత్సహించి వారిని ఆశీర్వదించేందుకు ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి, నటి రోజా న్యాయనిర్ణేతలుగా వ్యవహరించనున్నారు. వరుస హిట్ సినిమాలతో సక్సెస్ఫుల్ డైరెక్టర్ గా రాణిస్తున్న అనిల్ రావిపూడి జీ తెలుగు డ్రామా జూనియర్స్ 8 షో ద్వారా బుల్లితెరపై మొదటిసారిగా న్యాయనిర్ణేతగా వ్యవహరిస్తూ చిన్నారుల బంగారు భవిష్యత్తుకు సూచనలు, సలహాలు ఇవ్వను న్నారన్నారు. ఇక, డ్రామా జూనియర్స్ సీజన్ 8 గ్రాండ్ లాంచ్ ఎపిసోడ్ ముఖ్య అతిథులుగా ప్రముఖ నటులు జగపతి బాబు, ఆమని హాజరై చిన్నా రుల్లో మరింత ఉత్సాహం నింపనున్నారన్నారు. ఇక, ఈ సీజన్లో పాల్గొనే చిన్నారులు రెండు జట్లు బాయ్స్ టీమ్, గర్ల్స్ టీమ్‌గా తలపడనున్నారు. గర్ల్స్ టీమ్‌కి యాంకర్ లాస్య, బాయ్స్ టీమ్‌కి త్రినయని సీరియల్‌తో జీ తెలుగు ప్రేక్షకులను అలరించిన నయని మెంటర్లుగా వ్యవహరిస్తున్నారు. మెంటర్ల సారథ్యంలో అలరించే స్కిట్స్‌తో అంతులేని వినోదంపంచే కార్యక్రమాన్ని జీతెలుగు వేదికగా ప్రతి శనివారం మీరూ తప్పకుండా చూడాలన్నారు.

## తిరువూరు నియోజకవర్గ టిడ్కో ఇళ్లకు మోక్షం ఎప్పుడో...

విశాలాంధ్ర-తిరువూరు: తిరువూరు నియోజకవర్గ టిడ్కో ఇళ్ల కోసం కళ్ళు కాయలు కాసేలా ఎదురుచూస్తున్న సుమారు 2780 మంది లబ్ధిదారులు ఉన్నారు. ప్రభుత్వాలు వస్తున్నాయి పోతా వున్నాయి కానీ వీరి గోడు వినేది ఎవరు?. మారని పేదింటి వాడి కల 2014 ముఖ్యమంత్రి శ్రీ నారాచంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన టిట్కో ఇల్లు నిర్మాణం ని ఇప్పటివరకు కూడా పూర్తికాని పరిస్థితికి కారణం ఎవరు?.ఇందులో సెలెక్ట్ అయిన లబ్ధిదారులు, అటు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సెంటు భూమి, లేక మధ్యలో ఇరుక్కుపోయిన లబ్ధిదారులు.ఇటు సొంతిల్లు లేక, ఇప్పుడున్న పరిస్థితుల్లో అద్దెలు కట్టలేక, లబ్ధిదారుల పరిస్థితి అగమ్యాగోచరంగా తయారైంది. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి, తిరువూరు టిడ్కో ఇళ్లను త్వరగా పూర్తి చేసి ఇప్పటికీ 11 సంవత్సరాల నుంచి ఎదురుచూస్తున్న, లబ్ధిదారులకు, అందజేస్తారని మనవి చేసుకుంటూ.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-బంటుమిల్లి : విద్యార్థులు విద్యను ఇష్టంతో అభ్యసిస్తే వారు ఉన్నత శిఖరాలను అందిపోచ్చుకోవడం కష్టం కాదని పెడన నియోజకవర్గ శాసన సభ్యులు కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. బంటుమిల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల 28 వార్షికోత్సవ కార్యక్రమం గురువారం కళా శాల ప్రిన్సిపాల్ డాక్టర్ సూరగం జగన్ మోహనరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా పెడన నియోజకవర్గ శాసన సభ్యులు కాగిత కృష్ణప్రసాద్ పాల్గొని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అదనపు తరగతి గదుల నిర్మాణానికి, కళాశాల చుట్టు ప్రహరీ గోడ నిర్మాణానికి ప్రధాన మంత్రి ఉచిత శిక్ష అభియాన్ పథకం ద్వారా మంజూరైన రూ. 5కోట్లు నిధుల పనులకు భుమిపూజ, శంకుస్థాపన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అనంతరం కాగిత మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పాఠశాలలు, కళాశాలలను పెంపొందిస్తూ నాణ్యమైన విద్యను అందించాలనే దృఢ సంకల్పంతో విద్యాశాఖామంత్రి నారా లోకేష్ ఆహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ఫౌండర్, విశ్రాంత అధ్యాపకులు మట్ట రాధా కృష్ణ, ఎంఇఒ త్రిపురసుందరిదేవి, ప్రముఖ న్యాయవాది అంగర రంగనాధ్ ,మండల నీటిసంఘం అధ్యక్షులు బొర్ర కాశీ విశ్వేశ్వరరావు,ఇల్లూరి లీలాకృష్ణ ,ఎం డి నజీర్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం ఉద్యోగుల పక్షపాతి

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలన ఉద్యోగుల పక్షంగా పనిచేస్తోందని ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పన్నులశాఖ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కెఆర్ సూర్యనారాయణ స్పష్టం చేశారు. ఏపీ సీటీ సర్వీస్ అసోసియేషన్ విజయవాడ 1, 2, 3, డివిజన్ల నూతన కార్యవర్గం జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వివిధ కారణాలతో గత 3 సంవత్సరా లుగా సంఘం తరుపున ఎటువంటి సమావేశాలు జరుపులేకపోయామని తెలిపారు. నూతన కార్యవర్గం ఏక్రగీవంగా ఎన్నుకోవడం శుభపరిణామని ఎన్నికైన నాయకులు సంఘం బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. గత ప్రభు త్వంలో ఉద్యోగుల పట్ల ఎదురైన ప్రతి సమస్యను పరిష్కరించడానికి సీఎం చంద్రబాబు నాయుడు సానుకూలంగా ఉన్నారని తెలిపారు. నిబంధనలకు వ్యతిరేకంగా గతంలో వివిధ జిల్లాలకు బదిలీయైన ఉద్యోగులను రాష్ట్రపతి ఉత్తర్వుల మేరకు న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నూతన పీఆర్సీని తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోందని దానితో పాటు డిఎ, పాత బకాయిల చెల్లింపుల విషయంలో త్వరలో ఒక నిర్ణయానికి ప్రభుత్వం వస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జీఎం రమేష్‌కుమార్, ఏపీజీఈఏ ప్రధాన కార్యదర్శి యం రమేష్‌కుమార్, కోశాధికారి జీఆర్‌వి ప్రసాద్ తదితర నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

-నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం

ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పన్నులశాఖ విజయవాడ 1 డివిజన్ అధ్యక్షుడు పరసా విద్యాసాగర్, కార్యదర్శిగా పివి రాంబాబు, కోశాధికారి గఫూర్ సయ్యిద్ లతో పాటు సభ్యులు ఎన్నిక కాగా, 2 డివిజన్ అధ్యక్షుడుగా సీహెచ్ దుర్గాప్రసాద్, కార్యదర్శి మందా రాజేష్, కోశాధికారి డి సునీల్‌లతో పాటు సభ్యులు, 3 డివిజన్ అధ్యక్షుడుగా కెవిఎన్ దుర్గా, కార్యదర్శిగా పీఎల్ సాయిరాం, కోశాధికారిగా కె రబ్బానీలతో పాటు సభ్యులను కెఆర్ సూర్యనారాయణ ప్రమాణ స్వీకారం చేయించి అభినందించారు.

## తల్లి పాలు బిడ్డకు ఆరోగ్యం

విశాలాంధ్ర - గుడివాడ : ఆహారం వైవిధ్యం కేవలం తల్లిపాల వల్లే సాధ్యమౌతుం దని ఐసిడిఎస్ అధికారిణి విజయ ఫ్లారెన్స్ అన్నారు. గురువారం స్థానిక పెద్దఎరికిపాడులోని ప్రైమరీ పాఠశాలలోని అంగన్ వాడీ కేంద్రంలో ఈ నెల 8 నుండి 22వ తేది వరకు జరిగే పౌష్టికాహార పక్షోత్సవల్లో భాగంగా గర్భిని, బాలింతలకు అహారం అలవాటుపై అవగాహన సదస్సును ఐసిడియస్ సూపర్‌వైజర్ జయంతి, ఎంఎస్‌కె రాఘవేణిలతో కలసి సిడిపిఓ విజయఫ్లారెన్స్ మాట్లాడుతూ బాలింతలు, గర్భినులు అహారం పట్ల అప్రమత్తంగా ఉండాల న్నారు. బాలింతలు మొదటి 6నెలల వరకు బిడ్డకు తల్లి పాలు అందించాలన్నారు. పోషకారం తీసుకుని ఆరోగ్యం ఉండలన్నారు. ఈ అంగన్‌వాడీ పెద్దఎరికిపాడు -1 ప్రమీలరాణి, -2 నవ్య, ఎం.లలితమణి, ఎఎన్ఎం భవానీ, బాలింతలు, గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు.

## కుమారుని మృతిపై తండ్రి ఫిర్యాదు

- తల్లి అక్రమ సంబంధం కారణంగానే కుమారుడు మృతి చెందాడని తండ్రి ఆవేదన
- జగ్గయ్యపేట చెందిన ప్రముఖ న్యాయవాది శ్రీనివాస్ గౌడ్ దీనికి కారణం అంటున్న తండ్రి

విశాలాంధ్ర-వత్సవాయి: అనుమానాస్పద స్థితిలో కుమారుడు మృతి చెందిన సంఘటన చూసి తండ్రి ఫిర్యాదు చేసిన సంఘటన మండల కేంద్రమైన వత్సవాయిలో చోటు చేసుకుంది. ఫిర్యాదారుడు తెలిపిన సమాచారం మేరకు వత్సవాయి గ్రామానికి చెందిన జెటిపిటి లక్ష్మీ సుధాకర్ రావు ఖమ్మంలో హోటల్ లో నైట్ వాచ్‌మెన్‌గా జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో తన డ్యూటీ ముగించుకొని ఇంటికి తిరిగి రాగా ఇంటికి తాళం వేసి ఉంది తన దగ్గర ఉన్న మరో తాళంతో ఇంటి తలుపు తీయగా కుమారుడు జెట్టిపి ప్రసన్న మణికంఠ (26) విగత జీవిగా కనిపించడంతో తన భార్య అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్న తన కుమారుడిని భార్య మరియు కుమార్తె అల్లుడు, జగ్గయ్యపేటకు చెందిన ప్రముఖ న్యాయవాది శ్రీనివాస్ గౌడ్ ప్రోత్బలం తోనే తన కుమారుని హత్య చేసి ఉంటారని సుధాకర్ ఫిర్యాదు చేయడంతో స్థానిక ఎస్సై ఉమామహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా తెలిపారు.

## చేనేత కార్మిక సంఘం వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర- కూచిపూడి : ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం 90 వ వార్షికోత్సవ వేడుకలు గురువారం కృష్ణాజిల్లా మొవ్వ మండలం కాజ గ్రామములో నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత కార్మిక సంఘ పతకాన్ని కృష్ణాజిల్లా చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు, పామర్రు నియోజకవర్గ సీపీఐ పార్టీ ప్రత్యేక ఆహ్వానితులు కోదాటి నారాయణ రావు ఆవిష్కరించారు. అలాగే కాజ ప్రధాన సెంటర్‌లో గల జాతీయ నాయకుల విగ్రహాలైనజాతిపిత మహాత్మా గాంధీకి పామర్రు నియోజ కవర్గ సీపీఐ కార్యదర్శి చెరుకు శ్రీనివాసరావు, భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్.బిఆర్అంబేద్కర్ కుకృష్ణాజిల్లాచేనేత నాయ కులు కోదాటి నాగయ్య, భారత మాజీ ప్రధాని బాబుజగ్జీవనరామ్‌కు కాజ సీపీఐ కార్యదర్శి నందం వెంకటేశ్వరరావు నూలు దండలు వేశారు. ఈ సందర్భంగా చేనేత సమస్యలపై పలువురు ప్రసంగిం చారు. కార్యక్రమంలో చేనేత కార్మికులు గౌరి సత్యప్రసాద్, కోదాటి కనకదుర్గారావు, నందం నరసింహారావు, చిరందాసు సత్యనారాయణ, పంచల మోహనరావు, కోదాటి ఈశ్వరప్రసాదు, కొన్నిపాటి శ్రీనివాసరావు, కోదాటి సుధాకరరావు, నందం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## మొవ్వలో జోరుగా బెల్టు దుకాణాలు

విశాలాంధ్ర-కూచిపూడి: మొవ్వ మండలంలోని 21 గ్రామాలలో మద్యం బెల్టు దుకాణాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నా ఎక్సైజ్అధికారులు ఏమాత్రందృష్టి సారించ(లే)కపోవడంవిమర్శలకు దారితీస్తోంది.మొవ్వ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మొవ్వమండలంలో అధికారయుతంగా మొవ్వ, కూచిపూడి, నిడుమోలు, కాజ గ్రామాలలో గల మద్యం దుకాణాలలో ప్రభుత్వం నిర్ణయించినసమయంలో మద్యం విక్రయాలు ఉన్నా అనుమతులు లేని షాపుల ద్వారా విక్రయాలు 21 గ్రామాలలో కొనసాగుతున్నాయంటే అధికారుల పర్యవేక్షణ ఏ విధంగా ఉందో తేటతెల్లమవుతోంది. ప్రభుత్వం చేస్తామని బెల్టు తీస్తామని హెచ్చరికలు జారీ చేస్తున్నా అవి చెవిటి వారం ముందు శంఖం ఊదినట్లుగానేఉందని పలువురు పేర్కొంటున్నారు.ఈ బెల్ట్ షాపులకు సమయ భావనలేకుండా 24 గంటల పాటు కొనసాగుతున్నాయన్నది బహిరంగ రహస్యం. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆవాస ప్రాంతాలలో కొనసాగుతున్న బెల్ట్ షాపులను తొలగించడానికి తమ వంతు కృషి చేయాలని పలువురు ఆశిస్తున్నారు.

## ఆధార్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-ఘంటసాల : మండల పరిధిలోని కొడాలి గ్రామ సచివాల యంలో జరుగుతున్న ఆధార్ క్యాంప్‌ను గ్రామస్తులు సద్వినియోగ పరుచుకోవాలని గ్రామపంచాయతీ కార్యదర్శి చిగురుపాటి వెంకట శివ నాగమణి గురువారం గ్రామస్తులకు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆధార్ అప్డేట్, తప్పులు తడకలు, సరిచేసుకోవాలని తప్పుగా ఉన్న పుట్టిన తేదీలు అడ్రస్సులు తదితరాలు సరి చేసుకోవాలని కార్యదర్శి నాగమణి తెలిపారు.

# మహిళలు, చిన్నారుల భద్రతపై దృష్టి పెట్టాలి : ఎస్పీ గంగాధరరావు

**విశాలాంధ్ర బ్యూరో -మచిలీపట్నం :** జిల్లా పోలీసు కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీసు అధికారులతో జిల్లా ఎస్పీ గంగాధర రావు శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహిం చారు. స్నేహపూర్వక పోలీసింగ్ ప్రజలకు అందిస్తూ, మహిళలు, చిన్నారుల భద్రతపై దృష్టి సారించాలని, శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని తెలిపారు. నేరం జరిగిన తర్వాత దర్యాప్తు చేసే కన్నా నేరం జరుగకుండా ఉండటానికి ముందస్తు చర్యలు తీసు కుని ప్రశాం వాతావరణంలో ప్రజలు జీవిం చేలా చూడా లని తెలిపారు. ముఖ్యంగా మహిళల, చిన్నారుల సంబందిత నేరాల విషయంలో పోలీసులు వెంటనే ఎఫ్ఐఆర్ రిజిస్ట్రేషన్ చేయాలని, త్వరితగతిన విచారణ పూర్తి చేసి కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేయాలని సూచించారు. స్కూలు పిల్లలు మరియు కళాశాల లో అవేర్నస్ క్యాంపులు పెట్టి పిల్లలకు గుడ్‌టచ్ మరియు బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించాలన్నారు. శక్తి బృందాల ద్వారా జనసంచారం అదికంగా ఉన్న ప్రదేశాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, తమ సమస్యను ధైర్యంగా ఫిర్యాదు చేసేలా అవగాహన కల్పించాలన్నారు. గంజాయి నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించిందని, జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి అందరూ కృషి చేయాలని అన్నారు. గంజాయి కేసుల్లో విచారణ వేగవంతం చేయడానికి ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ యూనిఫామ్ సర్వీస్ నిర్వహించే ప్రతి సిబ్బంది ఎంతో నియమ నిబందనలతో విదులు నిర్వహించాలని, సిబ్బంది ప్రవర్తన సరిగా లేకుంటే వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవడానికి ఏమాత్రం వెనుకాడబో మని తెలిపారు. కృష్ణాజిల్లా పోలీసు శాఖకు మంచి పేరు తీసుకొచ్చేలా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలి అన్నారు. పోలీస్ స్టేషన్‌లో నిర్వర్తించే ప్రతి రికార్డును సక్రమంగా నిర్వర్తించాలని, రికార్డ్స్ అప్‌డేట్ చేసుకోవాల ని తెలిపారు. మహిళలు, చిన్నారుల మిస్సింగ్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ కనపరస్తూ వారి వివరాలు తెలుసుకోవాలన్నారు.

## శ్రీ సత్యమ్మ జాతర్లలో
## ఏపీ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

**విశాలాంధ్ర-నంది గామ:** కోరినా కోరికలు తీర్చే కొంగుబంగారమై విరాసి ల్లుతున్న శ్రీ సత్యమ్మ అమ్మవారి జాతరలో పాల్గొనడం ఎంతో ఆనం దాన్ని అందించిందని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు మండల పరిధిలోని అంబారుపేట గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ సత్యమ్మ అమ్మవారి ఐదు రోజుల జాతరలో భాగంగా గురువారం నందిగామ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లా నందిగామ నియో జక వర్గ పరిధిలోని నేషనల్ హైవేకి అనుసంధానంగా ఉన్న అంబారుపేట గ్రామంలో వేంచేసి ఉన్న స్వయంభు శ్రీ సత్యమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మ వారి జాతర మహెూత్సవం కనుల పండుగగా జరుగుతుందని అన్నారు. ఏటా ఐదు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అమ్మ వారిని దర్శించుకొని కోరిన కోరికలు తీర్చే విలవేల్పుగా భక్తులకు దర్శనమిస్తు న్నారన్నారు. విశేష అలంకారములు, నిత్య పూజా కార్యక్రమములు, హెూమ కార్యక్రమాలు, శ్రీ అమ్మవారి గ్రామబోనాలు, ప్రభబండ్ల ఊరేగింపు వైభవంగా, సువర్ణ పుష్పములతో ఖడ్గమాలార్చన, అమ్మవారికి పంచ హారతులు, నీరాజన మంత్రపుష్పములతో అంగరంగ వైభవంగా జాతర మహెూత్సవాలు గ్రామ కమిటీ ఆలయ అధికారులతో కలిసి నిర్వహించారన్నారు.

## ఆవుల యజమానులకు రూ. 10వేలు జరిమానా

**విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ :** నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జ్ కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ ఆదేశాల మేరకు రోడ్లపై ఆవు లను వదిలిన యజమాను లకు రూ.10వేలు జరిమానా విధించనున్నట్లు వీఎంసీ అధికారులు తెలిపారు. రోడ్లపై పశువులను వదిలిపెట్టడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలగటంతో పాటు ప్రమాదాలు సంభవించటం, ప్రజలకు అసౌకర్యం కలిగించటం, పారిశు ధ్యానికి అంతరాయం కల్పిస్తు న్నట్లు తెలిపారు. ఆయా అంశాలను దృష్టిలో ఉంచుకొని ఆవులను రోడ్లపై వదిలి పెట్టకుండా నియంత్రించేందుకు అజిత్‌సింగ్ నగర్ గార్బేజ్ ట్రాన్స్ ఫర్ స్టేషన్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కాటిల్ షెడ్‌లో గోవుల ఆరోగ్య సంరక్షణ కోసం వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.ఎస్.ఎస్.రెడ్డి పర్య వేక్షణలో ఉంటాయని తెలిపారు. ప్రజలందరూ రోడ్లపై పశువులను వదిలి పెట్టకుండా సహకరించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు తప్ప వని, ప్రజల భద్రత, ట్రాఫిక్ సౌలభ్యం, పర్యావరణం పరిరక్షణే ప్రధాన లక్ష్యమని తెలిపారు.

## నేల సారవంతం కోసం ప్రకృతి వ్యవసాయం
### కలెక్టర్ డీకె. బాలాజీ

**విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం:** మనిషి ఆరోగ్యం, నేల సారవంతం కోసం ప్రకృతి వ్యవసాయ పద్దతిలో పంటలు పండించడం ఎంతో అవసర మని జిల్లా కలెక్టర్ డీకె. బాలాజీ పిలుపునిచ్చారు. ప్రకృతి వ్యవసాయ పద్దతిలో పంటలు పండించే రైతులు ఇబ్బందులు పడే పరిస్థితులు ఉండవని, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సాదించవచ్చని, రసాయన పద్దతిలో వ్యవసాయా నికి అధిక పెట్టుబడి పెట్టడంతో పాటు భూసారాన్ని కోల్పోవడం, ఆహారం, నీటి కాలుష్యంతో ప్రజలు రోగాల బారిన పడటం వంటి దుష్ప్రభావాలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. జిల్లాలో సంభవిం చిన వరదలకు ప్రకృతి వ్యవ సాయ పద్దతిలో చేపట్టిన పంటలు మొక్క వేరు వ్యవస్థ పటిష్టంగా ఉండటంతో ముంపును తట్టుకుని నిలబడ్డా యని, రసాయనిక ఎరువులను ఉపయోగించి పండించిన పంటలు పూర్తిగా ఆ సమయంలో దెబ్బతిన్న సంఘ టనను గుర్తు చేశారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను స్వయం సహాయక సంఘాల సభ్యులు షాపులను ఏర్పాటు చేసి విక్రయించు కుని లాభం పొందవచ్చని సూచించారు. ఘన జీవామబుతం ద్రవ జీవామబుతం తయారీ విధానాన్ని పరిశీలించి వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కెఆరఎఆరఎ సి డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, ఏపీ ప్రకబుతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజరు పార్థసారధి, మండల తహసీల్దారు విమల కుమారి, గ్రామ సర్పంచ బండి వెంకటలక్ష్మి, స్వయం సహాయక సంఘాల సబ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ఏర్పాటు

**విశాలాంధ్ర-బ్యూరో మచిలీపట్నం :** స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యా లయం వద్ద శ్రీ సత్యసాయి చలివేంద్ర కేంద్రాన్ని కార్పొరేషన్ మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవా సంస్థలు చేస్తున్న సేవా కార్యక్రమాల్ని కొనియాడారు. యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ కే. వెంకట్రావు చల్లటి మజ్జిగ కేంద్రాన్ని ప్రారంభించారు. తనలో సేవా స్ఫూర్తి నింపినది శ్రీ సత్యసాయి బాబాఅని, అయన చూపిన మార్గం సమస్త మానవాళికి ఆదర్శప్రాయమని తెలిపారు. తాను ఆయన చూపిన మార్గంన్ని అనుసరిస్తున్నట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షులు కొమనగిరి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రేమ, సేవ సత్యసాయి సేవా సంస్థలకు ఆధారమని, వాటి ద్వారా మాత్రమే మానవత్వం నుండి దివ్యత్వం సంక్రమిస్తుందని తెలిపారు. సమితి కన్వీనర్ పోతుకూచి ఆంజనేయ కుమార్ మాట్లాడుతూ స్వామివారి 100వ జన్మదినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తు న్నట్లు, తెలిపారు. అనంతరం స్వామికి మహా మంగళహారతులు అందించి సుమారు 1500 మందికి చల్లటి మజ్జిగను, మంచి నీటిని అందించారు.

# సహకార వ్యవస్థపై విషం చిమ్ముతున్నారు

**విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్:** సహకారరంగంలో విజయ వంతంగా నిర్వహిస్తున్న కృష్ణా మిల్క్ యూనియన్, సంఘ బాధ్యులు, అధికారులపై కొందరు వ్యక్తులు సోషల్ మీడియా వేదికగా విషం చిమ్ముతున్నారని విస్సన్నపేట మండలంలోని పలు పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల అధ్యక్షులు గురువారం విస్సన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కృష్ణామిల్క్ యూనియన్ నిర్వహణలో దేశంలోనే అత్యున్నతస్థాయి సాధించి, రైతులకు శ్రేయోభిలాషిగా మారిందన్నారు. సంఘ వ్యవస్థను నిర్వీర్యం చేసే దిశగా గత పాలకులు చేసిన కుట్రలు విఫలమయ్యాయని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా కొందరు వ్యక్తులు కొడాలి ప్రమీల అనే మహిళను రంగంలోకి దించి, సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నట్లు వివరించారు. అధికారులు, చైర్మన్, సంఘ సభ్యులు, మహిళలపై తీవ్ర పరుష పదజాలంతో అసభ్యకంమైన వ్యాఖ్యలు చేస్తూ వీడియో క్లిప్పింగ్‌లు పోస్టు చేసినట్లు వివరించారు. సదరు నిందితురాలు, ఆమెతో ఈ పనులు చేయిస్తున్న వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని పాల ఉత్పత్తిదారుల సంఘాల అధ్యక్షులు నెక్కళపు వాణిశ్రీ, రాయల లక్ష్మి, మద్దిరెడ్డి వనజ, రేగళ్ల వెంకటరెడ్డి, పామర్తి లక్ష్మీ నారాయణ, చిల్లపల్లి పద్మారావు తదితరులు ఫిర్యాదు చేసినవారిలో ఉన్నారు.

# కోసూరు కాలువకు గండి : తాగునీరు వృధా

**విశాలాంధ్ర -పమిడిముక్కల:** వీరంకి లాకు సెక్షన్ పరిధిలోని కోసూరు కాలువ (భీమనది ఛానల్) చివరి గ్రామాలైన ఎండ కుదురు,భూషణం గ్రామాలకు తాగునీరు సరఫరా చేసేందుకు కాలువ కు తాగునీరు విడుదల చేయగా బోడ్డువానిగూడెం వద్ద గండి పడి సమీప పోలాలు మునిగి, గడ్డి వాములు తడిసిపోయాయినా కాలువలకు సంబంధించిన ఉద్యోగులు పట్టించుకోలేదని వాపోతున్నారు. వేసవి కాలం కావడంతో అధికారుల ఆదేశాల మేరకు సదరు కాలువకు నీరు విడుదల చేశామని లాకు పర్యవేక్షణాధికారి ప్రసాద్ తెలిపారు.నీరు సక్రమంగా సరఫరా అగుటకు గుమస్తాలు చూచుకోవాలని నా పరిధి కాదని తేల్చి చెప్పారు.వేసవి లో చుక్కనీరు అందని సమయంలో కాలువలు చూడవలసిన ఉద్యోగులు పట్టించుకోకపోవడం ఏమిటి ని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.పశువులు తినే గడ్డి తడిసిపోయిందని దానిని ఎవ్వరూ తీసుకోరని అంటున్నారు.ప్రభుత్వం కాలువ గట్టు లు పటిష్ఠం చేయ్యాలని ప్రజలు కోరుతున్నారు.

## బాలసంజీవిని కిట్స్ పంపిణీ

విశాలాంధ్ర-పెదనందిపాడు : పుసులూరు, వరగాని అంగనవాడి కేంద్రాలలో పోష్టికాహార పక్షోత్సవాల సందర్భంగా సూపర్‌వైజర్‌లు వై.రాజ్యలక్ష్మి, వి.అరుణ గురువారం బాలసంజీవిని కిట్స్ పంపిణీచేశారు. ఈ సందర్భంగా తల్లి పాల ప్రాముఖ్యత, అనుబంధ ఆహారం గురించి అవగాహన కల్పించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.కమలాకరరావు పిల్లలకు వైద్యసేవలు అందించారు. ఈ కార్యక్రమంలో లెనోరాక్సిన్, వి.సుజాత, అంగన్‌వాడీ కార్యకర్తలు రాధారాణి, వర్కర్స్ పీవీ లక్ష్మి, కె.నాగలక్ష్మి, తల్లులు, గర్భవతులు పాల్గొన్నారు.

## 23న మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-పొన్నూరు : ఈ నెల 23న గుంటూరు జిల్లా పొన్నూరు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ చంద్రశేఖర రావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ భవనం పద్మలీల అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మండల అభివృద్ధి కార్యక్రమాలపై చర్చిస్తారన్నారు. ప్రజాప్రతినిధులతో పాటు మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

## అహల్యాలో గర్భిణీలకు అవగాహన

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక కొత్తపేట శివా లయం సమీపంలో ఉన్న అహల్య హాస్పిటల్ నందు 'అంతర్జాతీయ మాతృ సంరక్షణ దినోత్సవం' సందర్భంగా గర్భిణీ స్త్రీలకు అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గైనకాలజిస్ట్ డాక్టర్ రాజకుమారి గర్భిణీ సమయంలో గర్భిణీ స్త్రీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలియజేశారు. అదేవిధంగా ప్రసవం అయిన తరువాత బిడ్డ విషయంలో తల్లి తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలిపారు. డెలివరీ అయిన తరువాత పోస్ట్ నేటల్ కేర్ చాలా అవసరమన్నారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలన్నీ పాటిస్తే మెటర్నల్ డెత్‌లు అనేవి తగ్గుతాయని డాక్టర్ రాజకుమారి అన్నారు. ఈ కార్యక్రమంలో అహల్య హాస్పిటల్ పేషంట్స్ అండ్ సిబ్బంది ఉన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యలపై ఎన్ఎం యూపి గుంటూరు-1, 2 రన్నింగ్, గ్యారేజీ ఉద్యోగులు, మహిళా ఉద్యోగులు గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో గురువారం భారీ ధర్నా, గేట్ మీటింగ్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కేవీవీఎస్ఎస్ రాజు మాట్లాడుతూ ఉద్యోగ భద్రతా సర్క్యులర్ 1/2019 అమలు చేయాలని, ఈహెచ్ఎస్ స్థానంలో ఆర్టీసీలో ఉన్న పాత వైద్య విధానాన్ని కొనసాగించాలని, నాలుగు సంవత్సరాల నుంచి ఆగిపోయిన ప్రమోషన్స్ ఆర్టీసీ రూల్స్ ప్రకారం ఇవ్వాలని కోరారు. జీఓ 114లో పొందుపరచిన ప్రకారం అలవెన్సులు రూ.150 నుంచి రూ.400లకు పెంచాలని, ప్రభుత్వ జీఓ ప్రకారం మహిళా ఉద్యోగస్తులకు చైల్డ్ కేర్ లీవ్ ఇవ్వాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థ ద్వారా జీతాలు చెల్లించాలని, గ్యారేజీలలో పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని, విజ్ఞప్తి చేశారు. యూనియన్ జిల్లా చైర్మన్ సుబ్బారావు, డీవీ శంకరరావు, చిన్నబ్బాయి, రాంబాబు రెడ్డి, ఏకే రావు, డీఎన్ రావు, హేమలత, సుజాత, లక్ష్మీ, కృష్ణవేణి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# లిక్కర్ డిపో ముఠా కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-మంగళగిరి : లిక్కర్ డిపోలో పనిచేస్తున్న ముఠా కార్మికుల పరిస్థితి అధ్వాన్నంగా ఉందని ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ వెంకటసుబ్బయ్య ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మంగళగిరి నగర పరిధిలోని ఆటోనగర్‌లో గల ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బేవరేజ్ కార్పొరేషన్ కార్యాలయంలో అధికారికి ముఠా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ గుడివాడలోని లిక్కర్ బేవరేజర్స్ డిపోలో పనిచేస్తున్న ముఠా కార్మికుల పరిస్థితి అధ్వాన్నంగా అగమ్య గోచరంగా ఉందని ఆయన అన్నారు. లిక్కర్ డిపోలో 66 మంది కార్మికులు పనిచేస్తున్నారని, పని చేస్తున్న కార్మికులకు ప్రభుత్వాలు మారిన ప్పుడల్లా సమస్యలు తలెత్తుతున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో గోడౌన్‌లలో హమాలీలుగా పనులు నిర్వహిస్తున్న సమయంలో ప్రభుత్వం రైతుల ధాన్యం నిల్వకు ఇబ్బందిగా ఉంది అనడంతో ప్రైవేట్ గోడౌను ఏర్పాటు చేసుకున్నారన్నారు. గుడివాడలో స్థానికంగా 1998 నుంచి లిక్కర్ డిపోలో హమాలీలుగా పని చేస్తున్న కార్మికులను తెలంగాణ వారంటూ భయభ్రాంతులకు గురిచేస్తూ కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయన తెలిపారు. అధికారులు, స్థానిక ఎమ్మెల్యే స్పందించి సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు.

## మా-ఏపీ సినిమా ఆడిషన్లను నిర్వహించదు: దిలీప్‌రాజా

విశాలాంధ్ర-తెనాలి : తెనాలిలో ఏప్రిల్ 16న సినిమా ఆడిషన్లు పెడుతున్నట్లుగా వస్తున్న వార్తలకు, మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ 24 విభాగాల యూనియన్‌కు ఎలాంటి సంబంధంలేదని మా-ఏపీ వ్యవస్థాపకులు సినీదర్శకుడు దిలీప్‌రాజా తెలిపారు. మా-ఏపి కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన నటీనటుల కోసం మా-ఏపి ఆడిషన్లు నిర్వహించదని స్పష్టం చేశారు. రాష్ట్ర విభజన అనంతరం 2018లో అప్పటి తెనాలి శాసనసభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మా-ఏపి సంస్థ లోగోను లాంఛనంగా విడుదల చేసి ప్రారంభించగా, మా సంస్థ పేరుతో తెనాలిలో వేరెవరో ఈనెల 16న ఆడిషన్లు పెడుతున్నట్లుగా జరుగుతున్న ప్రచారం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మాకు రిజిష్టరు అయిన టైటిల్‌ను వేరొకరికి అదే టైటిల్ ఏ విధంగా వర్తిస్తుందని ఆయన సంబంధిత అధికారులను ప్రశ్నించారు. మా సంస్థ పేరు లేకుండా వేరే పేరుతో ఆడిషన్లు పెట్టుకుంటే తమకెలాంటి అక్షేపణ లేదని అభిప్రాయపడ్డారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ దుష్ప్రచారాలు నమ్మవద్దని మా -ఏపి సంస్థ ఆడిషన్లు నిర్వహించదని ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో దర్శకుడు మణివరన్, నటుడు మిలటరీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లను శుభ్రం చేసిన టీడీపీ నాయకులు

విశాలాంధ్ర-తాడేపల్లి : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపులో భాగంగా ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరం గ్రామంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని గురువారం టీడీపీ నాయకులు నిర్వహించారు. గ్రామ పరిధిలోని ఎస్సీ స్మశాన వాటిక రోడ్డు నుండి శివాలయం, నాగేంద్రస్వామి టెంపుల్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను, చెట్లను నరికి రోడ్లను శుభ్రం చేశారు. నాలుగు ట్రాక్టర్లు, ఒక జెసిబి, 40 మంది సిబ్బందితో టీడీపీ నాయకులు స్వయంగా పలుగు, పార చేత బూని ముళ్ళ కంపను తొలగించడమే కాక, చీపుర్లు పట్టుకొని రోడ్లను ఊడ్చారు. చెత్త కుప్పలను ఎత్తి, డ్రైనేజీలు శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షులు ఈపూరి బాబు, టీడీపీ సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూధనరావు, టీడీపీ గ్రామ ప్రధాన కార్యదర్శి మద్దినేని సుబ్రమణ్యం, జొరుగా దాసు, చావలి సురేష్, షేక్ నాగూర్ వలి, గుంపిన నాగేశ్వరరావు, పాకనాటి మధు, కొడవటి సురేష్, కత్తిక శ్రీరాములు, కంచర్ల కోటేశ్వరరావు, గ్రామ సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు, యానిమేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## డీలర్లు ఈకేవైసీ పూర్తి చేయాలి

విశాలాంధ్ర-కాకుమాను : తహశీల్దార్ బి.వెంకటస్వామి గురువారం తన కార్యాలయంలో మండల పరిధిలోని చౌక డిపో డీలర్లతో సమావేశం నిర్వహించారు. త్వరితగతిన ఈకేవైసీ పూర్తి చేయాలని ఆయన డీలర్లను ఆదేశించారు. ఈకేవైసీ పూర్తికాని రేషన్ కార్డుదారులకు రేషన్ నిలుపుదల చేయడం జరుగుతుందని ఆయన తెలియజేశారు.

## 'అంతర్జాతీయ షుగర్ వ్యాధి వైద్యుల సదస్సు'లో డాక్టర్ వీవీ రామ్ కుమార్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఇటీవల థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో 'వరల్డ్ దయాబెటిక్ కాంగ్రెస్-2025' సదస్సు జరిగింది. ఈ సదస్సుకు గుంటూరు పట్టణంలోని ఎస్వీఆర్ షుగర్ హాస్పిటల్ అధినేత, ప్రముఖ షుగర్ వ్యాధి నిపుణులు డాక్టర్ వి.వి.రామ్ కుమార్ పాల్గొన్నారు. థాయ్‌లాండ్ ప్రజారోగ్య శాఖ మంత్రి సోమ్సక్ తేప్సితిన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సదస్సు నందు ఇంటర్నేషనల్ దయాబెటిక్ ఫెడరేషన్ అధ్యక్షులు పాల్ పీటర్ సారధ్యంలో దాదాపు 120 దేశాల నుండి పది వేల మందికిపైగా ప్రతినిధులు, 10 ప్రత్యేక సెషన్స్ ద్వారా ఒక్కొక్క సెషన్‌లో వెయ్యి మందికిపైగా వివిధ అంశాలపై చర్చించారు. ప్రపంచ వ్యాప్తంగా ముఖ్యంగా ఆసియా దేశ ప్రజలు తెల్లటి బియ్యం, ఎక్కువ కార్బోహైడ్రేట్స్ కలిగిన ఆహారం తీసుకోవడం, సరియైన వ్యాయామం లేకపోవడం షుగర్ వ్యాధికి కారణమవుతుందని ఈ సదస్సులో గుర్తించారు. డాక్టర్ రామ్ కుమార్ మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా షుగర్ వ్యాధి వైద్యంలో తాను చేస్తున్న కృషిని గుర్తించి అప్పటి స్వీడన్‌లో జరిగిన అంతర్జాతీయ దయాబెటిక్ కాన్ఫరెన్స్‌లో మేరీ జాన్ మేయర్ ఫెలోషిప్‌తో 1990, 1999 సంవత్సరాలలో ప్రత్యేక శిక్షణ పొందినట్లు చెప్పారు. ఇదే సూత్రాలపై తాను మూడు దశాబ్దాలుగా గుంటూరు నగర, జిల్లా ప్రజలకు వైద్యంతో పాటు దయాబెటిక్ నుండి పూర్తి ఆరోగ్యవంతం కోసం అవగాహన కల్పిస్తున్నట్లు ఈ సదస్సులో తెలిపినట్లు చెప్పారు. షుగర్ వ్యాధిపై అంతర్జాతీయంగా చేస్తున్న పరిశోధనలు ద్వారా అధునాతన మందులు, రెగ్యులర్‌గా షుగర్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండేలా వస్తున్న అధునాతన ఐకాన్ సీజీఎం వంటి పరికరాలను ప్రజలకు పరిచయం చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## చిరస్మరణీయులు చింతరాల

విశాలాంధ్ర-తుళ్లూరు : చిరస్మరణీయులు చింతరాల కోటేశ్వరరావు అని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కాబోతూ ఈశ్వరరావు అన్నారు. తుళ్లూరు మండలం రాయపూడి గ్రామంలో ఆయన 8వ వర్ధంతి గురువారం జరిగింది. కోటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడారు. తుళ్లూరు పరిసరాలలో పేద, బడుగు, బలహీన వర్గాల సమస్యలపై కోటేశ్వరరావు అనేక పోరాటాలు నిర్వహించారని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం కంకణబద్ధులై ఉండాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు జీవీ రాజు, వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్షులు గుర్రంకొండ సత్యానందం, కార్యదర్శి ఖమ్మంపాడు దేవుని దయ, సీపీఐ తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ల శివశంకర్ రావు, పార్టీ నాయకులు దేవుపూడి శ్రీనివాసరావు, తోకల అనురాధ, రత్న రాజు, చింతరాల గాంధీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేడు బడేపురంలో విగ్రహాల ప్రతిష్ఠ

విశాలాంధ్ర-తాడికొండ : బడేపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన దేవ స్థాన ప్రాంగణం లో నవగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ గురువారం తెలిపింది. ఆలయంలో శుక్రవారం శ్రీ గంగా పార్వతి సమేత ఓంకారేశ్వర స్వామి, పార్వ తీదేవి, మహాగణపతి, కాలభైరవ, పల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, వీరభద్ర కాళీ అమ్మవారు, దక్షిణామూర్తి, లక్ష్మీనారాయణ స్వామి, చండీకేశ్వర స్వామి, అలాగే అభయాంజనేయ స్వామి, ధ్వజస్తంభం, ఆలయ గోపురాలను ప్రతిష్టించనున్నట్లు తెలిపారు. అనంతరం అన్నదానం జరుగుతుందని, భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆలయ కమిటీ కోరింది.

## నూరుశాతం ఇంటిపన్నులు వసూలు చేయాలి

విశాలాంధ్ర-దుర్గి: ఇంటిపన్నులు ఈనెల ఆఖరి నాటికి నూరుశాతం వసూళ్లు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ఫోన్ మేసేజ్ ద్వారా తెలియజేసినట్లు మండల పంచాయతీ విస్తరణాధికారి పి.హెచ్ సత్యప్రసాద్ తెలిపారు. వసూళ్లైన నగదు చలానా ద్వారా గ్రామ పంచాయతీ ఖాతాలకు జమ చేయాలని సూచించారు.చలానా ప్రకారం వసూళ్లు చేసిన ఇంటిపన్నులు,పన్నేతరములను స్వర్ణ పంచాయతీ యాప్ సైట్ ఆన్లైన్లో అప్ లోడ్ చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులందరూ పైన తెలిపిన వాటికి భిన్నంగా వ్యవహరించిన చట్టప్రకారం తీసుకును చర్యలకు మీరే బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. మండలంలో ఐవీఆర్ఎస్ కాల్స్ కు సంబంధించి దుర్గి, పోలేపల్లి,కాకిరాల, ముటుకూరు, కోలగుట్ల గ్రామాలను ఎంపిక చేశారు. వాటికి సంబంధించి పంచాయతీ కార్యదర్శులు ప్రతిరోజు ఉదయం 6 గంటలకు గ్రామాలకు వెళ్ళి క్లాప్ మిత్రాలతో ట్రాక్టర్, ట్రై సైకిళ్ళు, గుడి,చర్చి,మసీదులో ఉన్న మైక్ ల ద్వారా గ్రామ ప్రజలకు తడి,పొడి చెత్త గురించి విస్తృతంగా ప్రచారం చేసి ఇంటి ముందుకు వచ్చే హరితరాయబారులకు చెత్తను అందించి స్వచ్ఛాంధ్ర,స్వర్ణాంధ్రప్రదేశ్-2047 విజన్ కు అందరూ కలిసి రావాలని కోరారు. 3 నెలల నుంచి ఎస్ డబ్ల్యూపీసీ షెడ్లు వద్ద నాడేఫ్ తొట్టెలను నిర్మించాలని పీఆర్ అండ్ ఆర్డీ కమిషనర్ ఆదేశించినా నేటి వరకు దుర్గి, పోలేపల్లో నిర్మాణం జరగలేదని, 2 రోజుల్లో పూర్తి చేయనియెడల ఆయా కార్యదర్శులపై చట్టపరమైన చర్యలకు జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేయబడునని తెలిపారు.

## మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలి

విశాలాంధ్ర-నరసరావుపేట: సింగపూర్ స్కూలులో జరిగిన అగ్నిప్రమాదంలో గాయపడ్డ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఆకాంక్షించారు. దైవానుగ్రహం,ప్రజల ఆశీస్సు లతో మార్క్ శంకర్ క్షేమంగా త్వరలో ఇంటికి చేరతా దన్నారు. ధైర్యంగా ఉండాలని ఆయన పవన్ ను కోరారు. కేంద్ర ప్రభుత్వం సింగపూర్ ప్రభుత్వంతో మాట్లాడి మార్క్‌శంకర్కు మిగిలిన పిల్లలకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

## రీ సర్వేకు సహకరించాలి

విశాలాంధ్ర - దాచేపల్లి : భట్రుపాలెం గ్రామ పరిధిలో శుక్రవారం నుంచి రీ సర్వే జరుగుతుందని తహశీల్దార్ కుటుంబరావు చెప్పారు. దీనిలో భాగంగానే గురువారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రీ సర్వే ప్రక్రియకు గ్రామ ప్రజలు, రైతులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదం.. వ్యక్తికి గాయాలు

విశాలాంధ్ర-అమరావతి: మండల కేంద్రమైన అమరావతి లో రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయాల పాలయ్యాడు. వివరా లిలా ఉన్నాయి. హెచ్ పి పెట్రోల్ బంకు సమీపంలో ద్విచక్ర వాహనంపై అమరావతి నుంచి ఎండ్రాయి వైపు వెళ్తున్న పెద్ది బోయిన బాలయ్య కు ఎండ తీవ్రతకు కళ్లు తిరిగి కింద పడటంతో వెనక నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు తగిలింది. దీంతో గాయా లైన ఆయన్ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు దీనిపై పోలీసులకు సమాచారం ఇచ్చారు. తీవ్ర గాయాలతో ఉన్న పెద్ద బోయిన బాలయ్య సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతూ ఉన్నారు.

## గడ్డివాము దగ్ధం

విశాలాంధ్ర-అమరావతి: మండల కేంద్రమైన అమరావతి విజయవాడ రోడ్డులోని గోపాల్ నగర్లో పెద్ది బోయిన బుల్లెయ్యకు చెందిన వరిగడ్డి వాము గురువారం సాయంకాలం అగ్నికి ఆహుతైంది. ప్రమాద స్థలానికి చేరుకున్న బాధితుడు బుల్లెయ్య మాట్లాడుతూ పది ట్రక్కుల వరి చేత కొనుగోలు చేసి తమ నివాసాల మధ్య ఖాళీ స్థలంలో భద్రపరిచినట్లు తెలిపారు. మధ్యాహ్న సమయంలో చిన్నారులు ఆటలాడుతూ అగ్ని వేయడంతో ఈ ప్రమాదానికి గడ్డివాము దగ్ధమైనట్లు తెలిపారు. దీని విలువ సుమారు రూ.2. 50లక్షలు ఉం టుందని వాపోయాడు. విషయం తెలుసుకున్న సత్తెనపల్లి అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అమరావతి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

## నేడు మహా పడిపూజ

విశాలాంధ్ర - దాచేపల్లి : శ్రీ అయ్యప్ప స్వామి జన్మదినోత్సవం సందర్భంగా దాచేపల్లిలోని అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం అయ్యప్ప స్వామి మహా పడిపూజ, అభిషేకాలు, భజన కార్యక్రమాలు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నారాయణపురం లోని బ్రహ్మనాయుడు ఆడిటోరియంలో సేవా సమితి పన్నెండో వార్షిక మహా పడి పూజ నిర్వహిస్తున్నారు.

# పీఏసీఎస్ కంప్యూటరీకరణలో బహుళ ప్రయోజనాలు

విశాలాంధ్ర-నరసరావుపేట: అంతర్జాతీయ సహకార సంవత్సరం సందర్భంగా నరసరావుపేట సహకార బ్యాంకు ఆవరణలో గురువారం పీఏసీఎస్‌లలో కంప్యూటీకరణ అనే అంశంపై పీఏసీఎస్ సీఈవోలు, డిపార్ట్‌మెంట్ ఆడిటర్లకు సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే ధనుంజయ్ పాల్గొని మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో కంప్యూటరైజేషన్ అనేది ఒక సాంకేతిక మార్పు మాత్రమే కాదని, అది గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో ఒక విప్లవాత్మకమైన పురోగతి అని చెప్పారు. మన దేశంలో గ్రామీణ రైతుల ఆర్థిక జీవన విధానానికి బలమైన మద్దతుగా నిలుస్తున్నవి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు అని, ఇవి రైతులకు విత్తనాలు, ఎరువులు, రుణాలు, తదితర సదుపాయాలు అందించే విధంగా పని చేస్తున్నాయి అని అన్నారు. కంప్యూటరైజేషన్ వల్ల ప్రతి లావాదేవీ డిజిటల్ రికార్డ్‌గా ఉండటంతో అవినీతి అవకాశాలు తగ్గుతాయి అని పేర్కొన్నారు. కంప్యూటకరణ వల్ల రైతులకు తక్కువ సమయంలో సేవలు అందుబాటులోకి రావడం,సిబ్బంది విధుల నిర్వహణలో సమర్థత పెరగడం, అన్ని పీఏసీఎస్ లను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా సమగ్ర డేటా లభ్యత పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి ఎం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# జగన్ శవ రాజకీయాలు మానుకోవాలి : యాగంటి

విశాలాంధ్ర- మాచర్ల : వ్యక్తిగత కార ణాలతో రాప్తాడులో జరిగిన హత్యపై మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి శవరాజకీయాలు చేయడం మానుకో వాలని టీడీపీ సీనియర్ నాయకులు, మాచర్ల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జున రావు అన్నారు. గురువారం యాగంటి తన కార్యాలయంలో మాట్లాడుతూ జగన్ ఒక సామాన్య ఎమ్మెల్యేతో సమానమేనని, అయినా కూటమి ప్రభుత్వం జగన్ కు జెట్ క్యాటగిరి కేటాయించిందన్నారు. రాప్తాడు నియోజకవర్గం కుటుంబ కలహాల నేపథ్యంలో జరిగిన హత్యను, రాజకీయ రంగు పులిమి రాజకీయ లబ్ధికోసం అక్కడకు వెళ్లి రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడుతున్న పోలీసులను దూషించడం హేయమన్నారు. వైసీపీ కార్యకర్తలే పోలీసులపై దాడి చేసి శాంతి, భద్రతలకు విఘాతం కల్పించారన్నారు. పోలీసులను బట్టలూడదీసి కొడతాననడం పై యాగంటి తీవ్రంగా ఖండించారు. నైతిక విలువలను మరచి మాట్లాడటం బెదిరించడం సరైన పద్ధతి కాదు జగన్ అని హితవు పలికారు. మొన్నటి ఎన్నికల్లో భారీ ఓటమి చవిచూసినా జగన్ మాటల్లో మార్పు రాలేదన్నారు. తన ఐదేళ్ల పాలనలో ఇదే పోలీస వ్యవస్థ అడ్డుపెట్టుకొని కక్ష సాధింపు చర్యలకు పాల్పడిన సంగతి వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా జగన్ బుద్ధి మార్చుకొని ప్రజా సమస్యల కోసం పోరాటం చేస్తే బాగుంటుందన్నారు. సమావేశంలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేషనల్ ట్రేడ్ సర్టిఫికెట్ల కొరకు దరఖాస్తులు చేసుకోండి : ప్రసాద్

విశాలాంధ్ర-మాచర్ల : నేషనల్ ట్రేడ్ సర్టిఫికెట్ల కోసం అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని పల్నాడు జిల్లా కన్వీనర్ మాచర్ల ఆర్ ఐ టి ఐ కళాశాల ప్రిన్సిపాల్ సి. హెచ్. ఎస్.వి ప్రసాద్ బాబు కోరారు. గురువారం ప్రిన్సిపాల్ ప్రసాద్ బాబు విలేకరులతో మాట్లాడుతూ గుర్తింపు పొందిన ప్రభుత్వ ప్రైవేటు సంస్థలలో పని చేస్తూ 3 సంవత్సరాల అనుభవం కలిగిన అబ్యర్థులు ఐ టిఐ తో సమాన అర్హత తో పాటు 10వ తరగతి ఉత్తీర్ణులై 21 సంవత్సరములు పూర్తిఅయిన అభ్యర్థులు నేషనల్ ట్రేడ్ సర్టిఫికెట్ (ఎన్ టి సి) పొందడానికి అర్హులన్నారు. దరఖాస్తులకు ఈ నెల 12వలోపు గడువు ముగుస్తుందన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ప్రోగ్రామింగ్‌లో ఉచిత శిక్షణ



విశాలాంధ్ర-బొల్లాపల్లి : ప్రస్తుత సమాజంలో బీటెక్ అయిపోయిన విద్యార్థులకు కోడింగ్ నేర్చుకోవడం చాలా అవసరమని, విద్యార్థికి వచ్చే శాలరీ, కోడింగ్ నేర్పరి తనం మీదే ఆధారపడి ఉంటుందని ఇందూరి రామాంజి రెడ్డి (ఐబీఎం బాంబే) తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అభివృద్ధి చెందిన అమెరికా, చైనా వంటి దేశాలలో కోడింగ్ ఆవశ్యకత ను ముందుగానే గుర్తెరిగి 8వ తరగతి నుండే విద్యా వ్యవస్థలో ఇనుమడించారని చెప్పారు. వినుకొండలో విద్యార్థులకు ఉచిత కోడింగ్ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు వితరాజు పల్లి సమీపంలోని సాయిబాబా దేవస్థానం ప్రక్కన ఉన్న తమ ఇనిస్టిట్యూట్ లో ఏప్రిల్ 13 నుంచి క్లాసులు ప్రారంభమవు తాయని తెలిపారు. ఉదయం, సాయంత్రం 6నుంచి8 గంటల వరకు నిర్వహిస్తున్నామని, శిక్షణ కొరకు వచ్చే విద్యార్థిని విద్యార్థులు మొబైల్ ఫోన్ కానీ ల్యాప్టాప్ లేదా ట్యాబ్ కచ్చితంగా తీసుకొని రావాలని, 8వ తరగతి నుండి బీటెక్ వరకు చదివిన విద్యార్థులు అర్హులని వెల్లడించారు.

# ప్రాణం నిలిపారు..

విశాలాంధ్ర-పెదకూరపాడు: సకాలంలో రూ. 40వేల స్టెమి ఇంజక్షన్ అందించడంతో గుండెపోటు నుండి రక్షణ పొందిన రోగి పువ్వాడ సాంబ శివరావు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. గుండెపోటు బాధితులకు ఒక్క సూది మందితో ప్రాణాలు నిలిపే అవకాశం ఉందని ప్రభుత్వం రూ. 40వేలు విలువచేసే టెనెక్ట్ ప్లేస్ ఇంజక్షన్ను ఉచితంగా అందజేస్తున్నట్లు పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు వెంకటేశ్వర్లు, రమేష్ నాయక్ అన్నారు పెదకూరపాడు మండలం పరిధిలోని జలాలపురం గ్రామానికి చెందిన పువ్వాడ సాంబశివరావు (65) గురువారం తెల్లవారుజామున తీవ్ర చాతి నొప్పి రావడంతో భార్య ధాత్రి దేవి, కుటుంబ సభ్యులు పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు. విధుల్లో ఉన్న మత్తు వైద్యులు వెంకటేశ్వర్లు చాతి నొప్పితో వచ్చిన సాంబశివరావుకు ఈసీజీ తీయించి గుండెపోటుగా నిర్ధారించారు. తక్షణ వైద్యం అందించి రూ. 40వేల టెనెక్ట్ ప్లేస్ ఇంజక్షన్ను ఉచితంగా అందించి ప్రాణం కాపాడారు. ఇంటి దీపాన్ని నిలిపారంటూ రోగి సతీమణి ధాత్రి దేవి వైద్యులు వెంకటేశ్వర్లకు కృతజ్ఞతలు తెలిపారు. భర్తతో కలిసి వైద్యులకు పండ్లు అందించి తమ కృతజ్ఞతా భావాన్ని తెలిపారు.

## ముప్పాళ్ల జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర- వినుకొండ : సేవాతత్పరుడు, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ ముప్పాళ్ళ జ్ఞానేశ్వరరావు 52వ జన్మదిన వేడుకలు స్థానిక కొత్తపేటలోని జీవీ రమణా రావు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. టీడీపి నాయకులు, స్నేహితులు, ఆప్తుల నడుమ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలువురు మాట్లాడుతూ ఎజిపి ముప్పాళ్ళ జ్ఞానేశ్వరరావు చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తి కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఇదేవిధంగా వారి సేవలు కొనసాగాలని ఆకాంక్షించారు. టీడీపి సీనియర్ నాయకులు జీవి రమణారావు, బిజెపి ఇంచార్జ్ యార్లగడ్డ లెనిన్ కుమార్, పి.అమర్నాథ్, కౌన్సిలర్ పివి సురేష్, మీసాల మురళీకృష్ణ, గడిపూడి విశ్వనాథం, షేక్ సలాం, పెండ్యాల పుల్లారావు, ల్యాబ్ శ్రీను, న్యాయవాది సైదారావు, పెండ్యాల సురేష్, కోటి పాల్గొన్నారు.

## కోడలిపై అత్తింటి వేధింపులు

విశాలాంధ్ర - దాచేపల్లి : అత్తింటి వేధింపులను తట్టుకోలేక ఓ కోడలు గురువారం పోలీసులను ఆశ్రయించింది. నారాయణపురానికి చెందిన చిన్నం రమ్య, విజయ్ కిరణ్ తేజకు రెండేళ్ళ కితం పెళ్లైంది. అయితే భర్త సహా అత్తింటి వారు ఆమెను తరచూ ఇబ్బంది పెడుతున్నారు. తిడుతూ, కొడుతూ మానసికంగా హింసిస్తున్నారు. వాటిని భరించలేకపోతున్న ఆమె తన భర్త, అత్త, మామ, మరిదిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. దాంతో నలుగురు నిందితులపై గృహ హింస చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై పాపారావు చెప్పారు.

## శిలువ శ్రమల పాదయాత్ర

విశాలాంధ్ర-నాదెండ్ల: మండలంలోని కనపర్రు గ్రామంలో తపస్కాలం సందర్భంగా గురువారం యోసేపుల దేవాలయం నుండి బాలయేసు పుణ్యక్షేత్రం వరకు శిలువ శ్రమల పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్రలో కనపర్రు, సాతులూరు, మల్లయపాలెం గ్రామాల నుండి వచ్చిన విశ్వాసులు భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో విచారణ గురువులు ఫాదర్ పగడాల చిన్నప్ప గారు తపస్కాల సూత్రాల గురించి ప్రసంగించారు. తపస్కాలం యొక్క ప్రాముఖ్యతను, ఆధ్యాత్మిక జీవన విలువలను వివరించారు. ఈ పాదయాత్రలో సుమారు 800 మంది భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం, పాల్గొన్న అందరికీ అన్నదానం ఏర్పాటు చేశారు.

## కమిషనర్‌కు సత్కారం

విశాలాంధ్ర - వినుకొండ : ఆంధ్రప్రదేశ్ పురపాలక సంఘాల మొత్తంలో ఆస్తి పన్ను వసూళ్లలో వినుకొండ పురపాలక సంఘం రాష్ట్రం మొత్తంలో 94.7శాతంతో మొదటి స్థానంలో నిలిచిన సందర్భంగా ఎంఏ యు డి ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎస్ సురేష్ కుమార్, సిడిఎంఏ కమిషనర్ సంపత్ కుమార్ చేతుల మీదుగా సత్కారం మరియు క్యాష్ ప్రైజ్ పొందిన వినుకొండ పురపాలక సంఘం కమిషనర్ సుభాష్ చంద్రబోస్‌కు విజయవాడలో గురువారం జరిగిన వర్క్ షాప్‌లో సన్మానం చేశారు. ఈ కార్యక్రమానన్ని తొలుత మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ చేతుల మీదుగా జరిగింది.

## అగ్రిగోల్డ్ ఆస్తుల వేలానికి కమిటీలు స్వాగతిస్తున్నాం: మాల్యాద్రి

**విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ :** ఏలూరు ప్రత్యేక కోర్టు ఉత్తర్వులను అనుసరించి అగ్రిగోల్డ్ ఆస్తులు వేలం వేయడానికి రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడాన్ని స్వాగతిస్తున్నామని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నగర గౌరవాధ్యక్షులు కోట మాల్యాద్రి అన్నారు. గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసోసియేషన్ సాగించిన పోరాట ఫలితమే నేడు కమిటీలు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఇది అసోసియేషన్ సాధించిన విజయమని, రాష్ట్ర నాయకత్వాన్ని అభినందించారు. ఈ కమిటీలు యుద్ధప్రాతిపదికన తమ ప్రక్రియను ప్రారంభించి అగ్రిగోల్డ్ ఆస్తులు ఎక్కడ ఉన్నాయో పరిశీలించాలన్నారు. ప్రతి అగ్రిగోల్డ్ బాధితునికి త్వరితగతిన న్యాయం చేసే దిశగా అడుగులు వేయాలని కోరారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నగర కార్యదర్శి పెదరామయ్య, ఉపాధ్యక్షులు ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీ రేట్లు పెంచండి

**విశాలాంధ్ర-తాడికొండ :** ఉపాధి కూలీలకు కూలీ రేట్లు పెంచాలని, గ్రామీణ ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సత్యానందం డిమాండ్ చేశారు. మండల పరిధిలోని కంతేరులో ఉపాధి పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సత్యానందం మాట్లాడుతూ వేసవి కాలం రీత్యా ఉపాధి కూలీలకు పని వద్ద మజ్జిగ, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. 200 రోజుల పనిదినాలు కల్పించి, రోజుకి రూ.600లు కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## హెచ్‌డీఎస్ ప్రమాణస్వీకారంలో ఎంపీ, ఎమ్మెల్యే

**విశాలాంధ్ర-నరసరావుపేట:** ఏరియా ప్రభుత్వ వైద్యశాలలోని వైద్యులు సిబ్బంది సేవే ప్రధానంగా విధులు నిర్వహించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు కోరారు. గురువారం హెచ్ డి ఎస్ నూతన కమిటీ ప్రమాణస్వీకారం సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలలో 200 పడకలతో నియోనేటాలజీ, జనరల్ సర్జరీ జనరల్ మెడిసిన్, ఆర్థో తదితర అన్ని విభాగాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వైద్యశాలలో నర్సింగ్ స్టాఫ్ సమస్యగా ఉందని ఆయన ఎంపీ దృష్టికి తీసుకువెళ్లారు పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యంతో నరసరావుపేట ప్రాంతీయ ప్రభుత్వ వైద్యశాలను మెడికల్ కళాశాల గా తీర్చిదిద్దవలసిన అవసరం ఉందన్నారు. ఈ వైద్యశాలలో కార్పొరేట్ స్థా యికి దీటుగా కార్డియో న్యూరాలజీ, నెఫ్రాలజీ తదితర విభాగాల కు చెందిన పట్టణానికి చెందిన సూపర్ స్పెషలిస్ట్ వైద్యులను వారానికి ఒకసారి వైద్యశాల సందర్శించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వ వైద్యశాలకు 75 పడకలతో కూడిన క్రిటికల్ కేర్ బ్లాక్ మంజూరు అయిందని దీనికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం 36 కోట్ల రూపాయలను మంజూరు చేసిందని ఆయన తెలిపారు. పల్నాడు బస్టాండ్ లోని పాత వైద్యశాలలో 100 పడకలతో తల్లి బిడ్డల యూనిటు ప్రారంభించడానికి కృషి చేస్తున్నామన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన హెచ్ డి ఎస్ చైర్మన్ డాక్టర్ ల క్కి రెడ్డి వెంకటేశ్వర రెడ్డి, డాక్టర్ కంకణపాటి భారతి, మల్లికార్జున రావు, సుబ్బమ్మ,ప్రసాద్ లను అభినందించారు. వైద్యశాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ రాష్ట్రంలో పేరెన్నిటికన్నా ప్రభుత్వ వైద్యశాలల్లో నరసరావుపేట మెరుగైన స్థానంలో చరిత్ర సృష్టించింది అన్నారు. తాను కరోనా టైంలో ఈ ప్రభుత్వ ఆసుపత్రి చేసిన సేవలను ప్రత్యక్షంగా చూశానని, ఎవరు చేయలే ని సేవలను ఈ ప్రభుత్వ వైద్యశాల కరోనా టైం లో అందించిందని తెలిపారు. కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ బి వి రంగారావు ,ప్రభుత్వ వైద్యశాల సూపర్నెంట్ డాక్టర్ ఎన్ సురేష్ కుమార్, ఆర్ ఎం ఓ లు డా క్టర్ ఏడుకొండలు దయానిధి, డా క్టర్‌మంత్రుల నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వీవీఐటీ కళాశాల.. ఇకపై వీవీఐటీ అంతర్జాతీయ సాంకేతిక విశ్వవిద్యాలయం

**విశాలాంధ్ర-పెదకాకాని:** వీవీఐటీ కళాశాల, వీవీఐటీ విశ్వ విద్యాలయం (వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నో లాజికల్ యూనివర్శిటి)గా రూపాంతరం చెందిందని, ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి ఉత్తర్వులు అందుకు న్నట్లుగా వీవీఐటీ విద్యాసంస్థల అధినేత వాసిరెడ్డి విద్యా సాగర్ ప్రకటించారు. "ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్" ప్రకటనకు తగ్గట్టు కేవలం రెండు నెలల వ్యవధిలో ప్రభుత్వం వీవీఐటీ అభ్యర్ధనను పరిశీలించి యూనివర్శిటి హోదాను కల్పించినదని అందుకుగాను ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు కృతజ్ఞతలు తెలిపారు. 40 సంవత్సరాలు క్రితం ఆప్టెక్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ ప్రారంభమైన విద్యాసంస్థలు యూనివర్శిటీ స్థాయికి ఎదగటం, లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తులో భాగం కావడం సంతోషాన్ని అందించిందని పేర్కొన్నారు. ఈసంద ర్భముగా వీవీఐటీ విశ్వవిద్యాలయం ప్రాంగణములో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశములో ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, సెక్రటరి సూర్యదేవర బదరి ప్రసాద్, జాయింట్ సెక్రటరి మామిళ్ళపల్లి శ్రీకృష్ణతో కలసి విశ్వవిద్యాలయం లోగో, బ్రోచర్లను విడుదల చేసారు. ఈవిద్యా సంవత్సరం నుండి విశ్వవిద్యాలయంలో అప్పా స్కూల్ ఆఫ్ బిజినెస్ ను ప్రారంభించి మేనేజ్ మెంట్ స్టడీస్ (ఎమ్.బి.ఎ., బి.బి.ఎ)లను అందించనున్నట్లు వివరిం చారు. విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదవా లని నినాదంతో వివిఐటి సంస్థలను ఏర్పాటుచేయటం జరిగిందని, తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా విద్యార్థులకు ఉత్తమ క్రమశిక్షణతో, విలువలతో కూడిన ఉత్తమ విద్యను అందించడం మాలక్ష్యం అని ఆయన తెలిపారు. కళాశాల ఉన్నతిలో, ప్రణాళిక ౕలలో, కార్యక్రమాలలో విద్యార్థులు. అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది భాగస్వామ్యంతో మెరుగైన ఫలితాలను సాధించామని అన్నారు. ప్రతిభగల విద్యార్థులకు తక్కువ ఖర్చుతో ఉన్నత విద్యను అందిస్తామన్న హామి ఇచ్చారు. అడ్మిషన్స్ డైరెక్టర్ ఉదయ్ కుమార్ మాట్లాడుతూ వీవీఐటీ యూనివర్శిటీలో విద్యార్థులు ప్రవేశం పొందేందుకు ప్రవేశ పరీక్ష వ్రాయవలసి ఉంటుందని ఏప్రియల్ 24న నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫ్రలితాల ప్రామాణికంగా ప్రవేశాలు, స్కాలరషిప్ అందించనున్నట్లు పేర్కొ న్నారు. ప్రిన్సిపల్ డా.వై. మల్లి ఖార్జునరెడ్డి, విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తాడికొండ ఆర్‌హెచ్‌టీసీలో 'అల్ట్రాసౌండ్ స్కానింగ్ సేవలు' ప్రారంభం

**విశాలాంధ్ర-గుంటూరు వైద్యం :** గుంటూరు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి ఆదేశాల మేరకు కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో తాడికొండ గ్రామీణ ఆరోగ్య శిక్షణ కేంద్రం (ఆర్‌హెచ్‌టీసీ) నందు రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ కుందురు శ్రీనాథ్, గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ అరుణ సహకారంతో అల్ట్రాసౌండ్ స్కానింగ్ సేవలు, స్త్రీ వ్యాధుల నిపుణుల సేవలను గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డిఎంహెచ్‌ఓ) డాక్టర్ కొర్ర విజయలక్ష్మి ప్రారంభించారు.

## గుంటూరు-1,2 డివిజన్ అధ్యక్షులుగా ఎస్ఎస్ఎస్ ప్రసాద్, ఏఎస్ సోమశేఖర్ ఎన్నిక

**విశాలాంధ్ర-గుంటూరు వైద్యం :** గుంటూరు జిన్నా టవర్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల సర్వీసెస్ అసోసియేషన్‌కు జిల్లా ఎన్నికలు గురువారం జరిగాయి.

ఈ సందర్భంగా గుంటూరు డివిజన్-1 ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా ఎస్ఎస్ఎస్ ప్రసాద్, కార్యదర్శిగా ఆరీఫ్ ఎన్నిక కాబడిన కార్యవర్గ సభ్యులు,

అలాగే గుంటూరు-2 ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా సోమశేఖర్, కార్యదర్శిగా ఎన్‌జె కిరణ్మయి, కార్యవర్గ సభ్యులందరి చేత రాష్ట్ర అధ్యక్షులు కేఆర్ సూర్య నారాయణ, ప్రధాన కార్యదర్శి సీఎం రమేష్ కూమార్‌లు ప్రమాణ స్వీకారం చేయించారు.

అనంతరం కొత్తగా ఎన్నికైన వారికి వారు శుభాకాంక్షలు తెలియజేశారు. ఉద్యోగుల సమస్యలే ప్రధాన అజెండాగా పని చేస్తామని కొత్తగా ఎన్నిక కాబడిన వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు సయ్యద్ చాంద్‌బాష, మహిళా విభాగం అధ్యక్షురాలు హేమలత, జిల్లా కార్యదర్శి సుమిత్రాదేవి, నగరశాఖ అధ్యక్షులు వై.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### NOTICE

**Before The Hon'ble District Consumer Disputes Redressal Commission at Guntur**
**C.C. No. 247 / 2024**

**Between:**
**Palagulla Venkata Ramana Reddy ..Complainant**
**And**
**Amazon Sellers Pvt.Ltd, Amazon Retail India Pvt.Ltd,Rep by its Authorized Signatory & Others ....Opposite Parties**

**To,**
**Opp. No-2:** Dawntech Electronics Pvt Ltd.,Rep. By its Authorized Signatory, ESR GMR Logistics Park, Shed No: 3 RGIA, Shamshabad. Rangareddy District, Hyderabad. Telangana- 500108. Registered Address: Salarpuria Windsor, 4th Floor, No:3, Ulsoor Road, Banglore-560042.
**Opp.No-4:** Samsung Service Center, Rep. By its Authorized Signatory,Opp.City Union Bank, Bank Street, Arundelpet, Narasaraopet, Palnadu Dt-522605.

పై నెంబరు C.C లో 2&4 అపోజిట్ పార్టీలు అయిన మీకు గౌరవ జిల్లా వినియోగదారుల కమీషన్ వారి ద్వారా నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున గౌరవ కమీషన్ వారు మీకు నోటీసును Subsituted Service ద్వారా పేపరులో ప్రకటన ద్వారా తెలియపరచమని ఆర్డరు వేయగా, సదరు ఆర్డరు ప్రకారము మీరు ది:22-04-2025న ఉ.గం.10-30ని.లకు పై తెలిపిన శ్రీయుత జిల్లా వినియోగదారుల కమీషన్ వారి యెదుట మీరు స్వయంగా కానీ, మీ అడ్వకేటు ద్వారా గానీ హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలయును. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని తెలియపర్చడమైనది.
(శ్రీయుత జిల్లా వినియోగదారుల కమీషన్ వారి అనుమతితో)
వాయిదా తేది:22-04-2025

**బి.మల్లికార్జునరావు,**
**కంప్లైనెంట్ తరపు అడ్వకేట్, గుంటూరు.**

### బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన గుంటూరుసిటీ, రాజాగారితోట, 4వ లైను డోర్.నెం.11-4-232/1 కాపురస్తురాలు నల్లపనేని గరటయ్య గారి కుమార్తెయున్నూ, సల్లా దుర్గాప్రసాద్‌గారి భార్య సరళ గారి సూచనల మేరకు యావన్మందికీ తెలియజేయునది ఏమనగా, నా క్లయింటు ది.25-01-2023న రెండు వేరు వేరు దఖలు దస్తావేజులు నెంబర్లు 282/2023 మరియు 284/2023 యస్.ఆర్.ఓ. తుళ్ళూరు ద్వారా గుంటూరు డి॥, నల్లపాడు సబ్.డి॥, పెద పలకలూరు గ్రామ డి.నెం.147-1డిలో చ.గ. 281.1/4లు మరియు చ.గ.267.1/2లు ఖాళీ నివేశన స్థలములను దఖలు పొంది ఆ తదాది సర్వ హక్కులతో అనుభవించుచున్నారు. అట్టి ఆస్తికి చెందిన పై తెలిపిన దఖలు దస్తావేజులను తీసికొని ది.24-03-2025న తన ఇంటి వద్ద నుండి ఆటోలో పెదకాకాని తోట ఏరియాకు వెళ్ళిన సందర్భములో పై డాక్యుమెంట్లు కలిగిన బ్యాగు పోయినది. సదరు విషయమై వచ్చిన దారినందు మరియు ఆ చుట్టుప్రక్కల ఎంత విచారించిననూ దొరికియుండలేదు. కావున సదరు ఒరిజినల్ దఖలు దస్తావేజు నెంబర్లు 282/2023 & 284/2023 గల దస్తావేజులు ఎవరికైనా దొరికినయెడల నాకు గాని, నా క్లయింటుకు గాని అందజేసిన వారికి తగినబహుమతి ఇవ్వబడును అట్లుకాక సదరు దస్తావేజును ఉపయోగించి ఎవరైనా ఏవిధమైన అన్యాక్రాంతములు చేసినయెడల నా క్లయింటు తీసుకొను చట్టపరమైన సివిల్ & క్రిమినల్ చర్యలకు బాధ్యులుకాగలరు.

**రెడ్డిచర్ల శ్రీనివాసరాజు, న్యాయవాది**
**5వ లైను, కన్నావారితోట, గుంటూరు. సెల్ : 8555938643**

### బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన విజయవాడ సిటీ, గుణదల, గంగిరెద్దు దిబ్బ, డోర్.నెం.50-11-3/10 కాపురస్తురాలు గుండాబత్తుల వీర వసంతరావుగారి భార్య గుండాబత్తుల పుష్పా వెంకట శివలక్ష్మీ గారి సూచనలమేరకు యావన్మందికీ తెలియజేయునది ఏమనగా, నాక్లయింటుకు ది.19-05-2008న దఖలు దస్తావేజు నెం.2115/2008 యస్.ఆర్.ఓ.పెదకాకాని ద్వారా గుంటూరు డి॥, పెదకాకాని సబ్.డి॥, కాజ గ్రామ డి.నెం.213/1, ప్లాట్ నెం.86 దాఖలా చ.గ.200 ఖాళీ నివేశన స్థలము సంక్రమించి ఆ తదాది సర్వ సంపూర్ణ హక్కు భుక్తములతో అనుభవించుచున్న ఆస్తికి చెందిన ఒరిజినల్ లింకు విక్రయ దస్తావేజు నెం.865/1990 యస్.ఆర్.ఓ.మంగళగిరి (చిరివెళ్ళ దుర్గ గారి పేరుతో గల) దస్తావేజు మరియు మరికొన్ని డాక్యుమెంట్లను తీసుకొని పెదకాకాని రిజిస్ట్రారు ఆఫీసు వద్దకు పని నిమిత్తము ది.09-04-2025న వచ్చి అక్కడ పనిని ముగించుకొని మరళ ఇంటికి వెళ్ళు తొందరలో సదరు ఒరిజినల్ లింకు విక్రయదస్తావేజు నెం. 865/1990 కనిపించలేదు. ఆ చుట్టప్రక్కల ఎంత విచారించిననూ దొరికియుండలేదు. కావున సదరు ఒరిజినల్ లింకు విక్రయ దస్తావేజు 865/1990 ఎవరికైనా దొరికినయెడల నాకు గాని, నాక్లయింటుకు గాని తెచ్చి ఇచ్చినవారికి తగిన బహుమతి ఇవ్వబడును.అట్లుకాక సదరు దస్తావేజును ఉపయోగించి ఎవరైనా ఏవిధమైన అన్యాక్రాంతములు చేసినయెడల నా క్లయింటు తీసుకొను చట్టపరమైన సివిల్ & క్రిమినల్ చర్యలకు బాధ్యులుకాగలరు.

**ప్రత్తిపాటి ప్రభాకరరావు, న్యాయవాది**
**దన్వంతరీ నిలయం, స్వామిథియేటర్ వెనుక, పట్టాభిపురం, గుంటూరు. సెల్: 9849084919**

### CHANGE OF NAME

We, **KONAKALLA ASWANIKUMAR** and **KONAKALLA BALA PRIYA SIRISHA**, Resident of Door No: 24-23-6, Nallacheruvu 12th Line, Indiragandhi Nagar, Guntur, Guntur District - 522003, Andhra Pradesh, are the parents of **KONAKALLA ROHITH VENKATA NAGA SAI SASHANK** (old name) 15 years minor Son. We have changed our son's name as **KONAKALLA SAI SASHANK** (New Name) S/o. **KONAKALLA ASWANIKUMAR**. Hereafter his name is known as **KONAKALLA SAI SASHANK** (New Name) S/o. **KONAKALLA ASWANIKUMAR.**

### పబ్లిక్ నోటీసు

నా క్లయింటు **కండ్లగుంట శ్రీనివాస రావు, S/O.** నారాయణ, R/O.డోర్ నెం.6-142, కండ్లగుంట గ్రామం, నకరికల్లు మండలం, పల్నాడు జిల్లా అను వారి నుండి తగు సమాచారం పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

నా క్లయింటు వినుకొండ మండలం, దొండపాడు రెవిన్యూ గ్రామ పరిధిలోని వారి వ్యవసాయ భూముల యొక్క ఒరిజినల్ విక్రయ దస్తావేజులు వినుకొండ సబ్-రిజిస్ట్రార్ నం.**1185/1997**, తేది. **17.04.1997**, నం.**1214/1997**, తేది. **19.04.1997**, నం.**1217/1997**, తేది. **19.04.1997**, నం.**1331/1997**, తేది. **26.04.1997** మరియు నం.**2267/1997**, తేది. **04.07.1997**లను ఫోటోస్టాట్ కాపీలు పొందుటకు తీసుకెళ్ళు క్రమములో నకరికల్లు గ్రామములోని బస్టాప్ సెంటర్ వద్ద ది.**08.03.2025** న పోగొట్టుకోవడమైనది, నా క్లయింటు సదరు దస్తావేజులను ఎంత వెతికినను దొరికియుండలేదు, కావున ఈ పబ్లిక్ నోటీసు ద్వారా యావన్మందికి తెలియజేయునది ఏమనగా సదరు పై చెప్పబడిన విక్రయ దస్తావేజులు నం. **1185 / 1997**, తేది. **17.04.1997**, నం. **1214/1997** తేది.**19.04.1997**, నం. **1217/1997**, తేది. **19.04.1997**, నం.**1331/1997**, తేది. **26.04.1997** మరియు నం. **2267/1997**, తేది. **04.07.1997** ఎవరికైన దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు సంప్రదించి ఇవ్వవలసిందిగా కోరడమైనది.

**సయ్యద్ మహమ్మద్ ఖాసీమ్**
**అడ్వొకేట్, కొత్తపేట, వినుకొండ.**
**సెల్:9030214799.**

విశాలాంధ్ర



## అంబేద్కర్ జాతీయ అవార్డుకు ఎంఈవో

**విశాలాంధ్ర-పెద్దకూరపాడు:** పెద్దకూరపాడు అమరావతి, క్రోసూరు, మరియు అచ్చంపేట మండలాల విద్యాశాఖ అధికారి ఏకుల ప్రసాదరావు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జాతీయ ప్రతిభా అవార్డుకు ఎంపికైనట్లు సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థా పక అధ్యక్షుడు డాక్టర్ పి.నాగయ్య తెలిపారు. 15 సంవత్సరాల పాటు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయునిగా మరియు 16 సంవత్సరాలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా మండల విద్యాశాఖ అధికారిగా పనిచేయుచున్న ఏకుల ప్రసాదరావు విద్యాభివృద్ధికి ఎంతగానో కృషిచేశారని, చదువు పట్ల విద్యార్థుల తల్లిదండ్రులలో చైతన్యం తీసుకొని వచ్చి ఐదు సంవత్సరాలు నిండిన బాలబాలికలందరినీ పాఠశాలలో చేర్పించి 100% ఎన్రోల్మెంట్‌కు కృషి చేసినారని, అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించినందుకుగాను వీరిని ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 13న గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ పురస్కారం ప్రధానం చేస్తారని పేర్కొన్నారు. అవార్డుకు ఎంపికైన ఏకుల ప్రసాదరావును ఉపాధ్యాయులు, వివిధ మండలాల విద్యాశాఖ అధికారులు అభినందించారు.

## ఎస్టీయూ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మానం

**విశాలాంధ్ర - దాచేపల్లి :** ఎస్టీయూ పల్నాడు జిల్లా అధ్యక్షుడు లింగిరెడ్డి వెంకట్రామిరెడ్డి ఇటీవల ప్యాఫ్టో పల్నాడు జిల్లా చైర్మన్‌గా ఎన్నికయ్యారు. దాచేపల్లి ఉన్నత పాఠశాల తెలుగు భాషోపాధ్యాయుడు కోసూరి రవికుమార్ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇటీవల ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. దాంతో ఎస్టీయూ మండల శాఖ నేతృత్వంలో వారిద్దరికీ గురువారం రాత్రి నారాయణపురంలోని శాఖ కార్యాలయంలో ఆత్మీయ సన్మానాన్ని ఏర్పాటు చేశారు. పల్నాడు ప్రాంతంలోని వివిధ మండలాల నుంచి శాఖ నాయకులు, ఉపాధ్యాయులు హాజరై మాట్లాడారు. అనంతరం వారిద్దరినీ ఘనంగా సత్కరించారు. ఆ తర్వాత అందరికీ వారిద్దరూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మండల శాఖ అధ్యక్షుడు బొంబోతుల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి మందా రాజశేఖర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చెట్టిపోగు ఏసురత్నంతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రపంచాన్ని అల్లకల్లోలం చేస్తున్న ట్రంప్ విన్యాసాలు

**విశాలాంధ్ర-గుంటూరు వైద్యం :** ప్రపంచ దేశాలను దోచుకొని యుద్ధాలు చేసి బతుకుతున్న అమెరికా అధిక టారీఫ్‌లు విధించటం విడ్డూరమని, ట్రంప్ చేస్తున్న విన్యాసాలు ప్రపంచాన్ని అల్లకల్లోలం చేస్తున్నాయని విద్యావేత్త, విశ్లేషకులు ఇ.చంద్రయ్య విమర్శించారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో 'ట్రంప్ టారిఫ్‌పై ప్రతి ఒక్కరూ నిరసన తెలియజేయాలంటూ గురువారం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' పేరుతో ట్రంప్ విధిస్తున్న టారిఫ్‌లు.. అనుసరిస్తున్న విపరీత పోకడలు ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలన్నింటిపై తీవ్ర ప్రభావం చూపుతున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సైతం 5.75 లక్షల ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్న రైతులు ఆందోళనలో ఉన్నారని, ట్రంప్ తాజా టారిఫ్‌పై మన దేశ ప్రభుత్వ స్పందన సక్రమంగా లేదన్నారు. లండన్, ప్యారిస్, బెర్లిన్ తదితర నగరాల్లో జనం నిరసనలు తొక్కుతుంటే భారతీయులు నిశ్శబ్దంగా ఉండటం సరికాదన్నారు. రాడికల్ హ్యూమనిస్ట్ చంద్రశేఖర్, వాణిజ్యవేత్త గుప్త, న్యాయవాది అవధానుల హరి పాల్గొన్నారు.

## మాతృభాషే సంస్కృతీ పరిరక్షణకు మూలాధారం : మండలి

**విశాలాంధ్ర-తాడేపల్లి:** ఏ ప్రాంత సంస్కృతి పరిరక్షింపబడాలన్నా ఆ ప్రాంత భాష ముందుగా రక్షింపబడాలని, మాతృభాషలు మృతభాషలు కాకుండా చూసుకోవలసిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందని మాజీ శాసన సభాపతి, తెలుగు భాషా సంఘం మాజీ అధ్యక్షులు, అవనిగడ్డ శాసన సభ్యులు మండలి బుద్ధప్రసాద్ అన్నారు. గురువారం కె.ఎల్. విశ్వ విద్యాలయం బి.ఏ.(ఐ.ఏ.ఎస్) విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ప్రక్రియలు, వాదాలు-సమాలోచన అనే అంశంపై ప్రారంభమైన రెండురోజుల అంతర్జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. విశిష్ట అతిథిగా హాజరైన రాష్ట్ర రహదారుల భద్రతా విభాగం డి.ఐ.జి. సి.హెచ్.విజయారావు మాట్లాడుతూ మాతృభాషలో సివిల్ సర్వీసెస్ వ్రాసి లక్ష్యాన్ని సాధించటం సులువౌతుందన్నారు. మరో ముఖ్య అతిధిగా హాజరైన వాణిజ్య పన్నుల విభాగం అసిస్టెంట్ కమీషనర్ డి.రాంబాబు మాట్లాడుతూ తాను తెలుగు ప్రధాన ఆప్షనల్‌గా తీసుకునే పోటీ పరీక్షలో ఈ స్థాయికి చేరానన్నారు. కీలకోపన్యాసం గావించిన ప్రసంగ ప్రజ్ఞా నిధి ఆంధ్ర లయోలా విశ్రాంత వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ గుమ్మా సాంబశివ రావు మాట్లాడుతూ ఆధునిక తెలుగు సాహిత్యంలో సుమారు 40కి పైగా ప్రక్రియలు, 20కు పైగా వివిధ వాదాలు ఉన్నాయన్నారు. అంతర్జాతీయంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రజలను ఈ వివిధ ప్రక్రియలలో తమ రచనల ద్వారా చైతన్య పరుస్తున్నారన్నారు. ప్రముఖ రచయిత్రి నైనాల వాణిశ్రీ మాట్లాడుతూ ఆధునిక తెలుగు కవిత్వం వివిధ ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లడంలో ఎంతగానో దోహదపడిందని అన్నారు. బి.ఏ.(ఐ.ఏ.ఎస్.) విభాగ అధిపతి డాక్టర్ బి.శివనాగయ్య కార్యక్రమానికి అధ్యక్షత వహించి సదస్సు లక్ష్యాలను, నేపధ్యాన్ని వివరిం చగా సహాయ ఆచార్యులు డాక్టర్ అద్దంకి ప్రజాపతి వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో వర్శిటీ వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్ధసార ధివర్మ, ప్రోవీసీలు డాక్టర్ ఏవీఎస్. ప్రసాద్, డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విభాగాధిపతి డాక్టర్ బి.శివనాగయ్య, ఉప విభాగాధి పతి డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ అద్దంకి ప్రజాపతి పాల్గొన్నారు.

## దాహం తీర్చేందుకు చలివేంద్రాల ఏర్పాటు

**విశాలాంధ్ర - రెంటచింతల :** ఎండల తీవ్రత అధికంగా ఉందని, బస్సు ప్రయాణికులతో పాటు మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు పనుల నిమిత్తం వచ్చే ప్రజల దాహం తీర్చేందుకు చల్లటి తాగునీటిని అందించేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో సరోజినీ దేవి గురువారం చలివేంద్రం ప్రారంభించి మాట్లాడారు. చల్లని నీటిని అందుబాటులో ఉంచి ఇక్కడికి వచ్చే వారికి అందించాలని ఆమె ఈ సందర్భంగా సూచించారు. అలాగే రెంటచింతల బస్టాండ్ సెంటర్లో ఎస్‌టీయు ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని మండల విద్యాశాఖ అధికారి శివ నాగేశ్వరరావు, బ్యాంకు మేనేజర్ ఆంజనేయులు నాయక్ గురువారం ప్రారంభిం చారు. సామాజిక బాధ్యతగా చలివేంద్రం ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులను ఈ సందర్భంగా వారు అభినందించారు. ఆయా కార్యక్రమాల్లో తెదేపా నేతలు సుమంత్ రెడ్డి, బోడపాటి రామకృష్ణ, సిద్దయ్య, ఇన్నారెడ్డి, ఎస్ టి యు ఉపాధ్యాయ సంఘం నేతలు లేళ్ల శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, బేబీ రాణి, అబ్దుల్ ఖుద్దుస్, వెంకటేష్ జిల్లా నేతలు ఫకీర్ అహ్మద్, ఆదా మహబూబ్, అమల బాబు, శిలార్, భీముడు నాయక్, మంగ్ల నాయక్, చంద్రశేఖర్, అహ్మద్ జానీ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## పొన్నెకల్లులో ఎమ్మెల్యే పర్యటన

**విశాలాంధ్ర-తాడికొండ :** ఈ నెల 14న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పొన్నెకల్లు రానున్నారు. ఈ నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లను స్థానిక శాసనసభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్ పరిశీలించారు. హెలిప్యాడ్, సభా స్థలం, అంబేద్కర్ విగ్రహ స్థలాన్ని పరిశీలించారు. జిల్లా, మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం లూధరన్ చర్చిని సందర్శించారు. ఈ కార్యక్రమంలో జేసీ భార్గవ తేజ, ఆర్డీఓ శ్రీనివాసరావు, డీపీఓ నాగ సాయికుమార్, డీఎల్‌పీఓ కందిమల్ల శ్రీనివాసరావు, ఎంపీడీఓ కె.సమతా వాణి, తహశీల్దార్ మెహర్ కుమార్, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అనాధ వృద్ధులు ధైర్యంగా ఉండాలి : ఎస్పీ హామీ

**విశాలాంధ్ర-విజయపురిసౌత్ :** ధైర్యంగా ఉండాలని మీకు న్యాయం చేస్తానని అనాధ వృద్ధ దంపతులకు పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాస రావు హామీ ఇచ్చారు. మాచర్ల మండలం విజయపురిసౌత్‌లో గురువారం ఎస్పీ పర్యటించారు. అదే గ్రామంలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న అరికట్ల బ్రహ్మారెడ్డి,విజయ లక్ష్మి వృద్ధ దంపతులు ఇటీవల తమ సమస్యను ఎస్పీకి పిర్యాదు చేయడంతో ఆయన బాధితుల ఇంటికి వెళ్లి వారి సమస్యను తెలుసుకున్నారు. వృద్ధ దంపతులు 8.5 ఎకరాల పొలంతో పాటు ఆస్తులను మొత్తం అమ్మి తమ కొడుకు ఉన్నత చదువులు చదివించడంతో యూఎస్‌లో సాఫ్ట్వేర్ ఇంజినీర్‌గా స్థిరపడ్డారని ఎస్పీకి చెప్పారు. అనారోగ్యంతో బాధపతున్నామని కొడుకు అంజిరెడ్డి తమను పట్టించుకోవడం లేదన్నారు. అనారోగ్యంతో పాటు ఆర్థిక పరిస్థితి దిగజారడంతో దుర్భర జీవనం గడపలేక ఆత్మహత్య యత్నానికి పాల్పడినట్లు ఎస్పీ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. అప్పట్లో మాచర్ల పోలీసులకు తమ కొడుకుపై ఫిర్యాదు చేస్తే మాజీ ఎమ్మెల్యే సోదరుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి తన కొడుకుకు మద్ద తుగా నిలిచి కేసు పరిష్కారం కాకుం డా చేశాడన్నారు. అనంతరం ఎన్నిసార్లు ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. దిక్కులేక కోర్టులో కేసు వేశామని నెలకు 10 వేలు భరణం ఇవ్వాలని తీర్పు ఇచ్చిందన్నారు. కోర్టు తీర్పును కూడా తమ కొడుకు అంజిరెడ్డి ఖాతరు చేయలేదని ఎస్పీకి తెలిపారు. న్యాయం తప్పక చేస్తానని ఎస్పీ వారికి హామీ ఇచ్చారు. ఎస్పీ వెంట మాచర్ల తహసీల్దార్ కిరణ్ కుమార్,మాచర్ల రూరల్ సీఐ నఫీజ్ భాష,విజయపురిసౌత్ ఎస్ ఐ షేక్ మహమ్మద్ షఫీ తదితరులు ఉన్నారు

## ఎస్ఆర్ఎంలో ఉచిత రక్తదాన శిబిరం

**విశాలాంధ్ర-మంగళగిరి :** అమరావతి ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో గురువారం ఉచిత రక్తదాన శిబిరం జరిగింది. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ ఆరోరా, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ వినాయకు శిబిరాన్ని ప్రారంభించారు. గుంటూరు సర్వజన ఆసుపత్రి నుంచి విచ్చేసిన వైద్యులతో పాటు యూనివర్సిటీ డాక్టర్లు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. యూనివర్సిటీ విద్యార్థులు, ప్రొఫెసర్లు, ఉద్యోగులు పెద్దఎత్తున హాజరై రక్తదానం చేశారు. మొత్తం 404 యూనిట్ల రక్తాన్ని దాతల నుంచి సేకరించినట్లు యూనివర్సిటీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అభినయ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్స్ అఫైర్స్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ వడ్డి రమేష్, రేవతి బాలక్రిష్ణన్, గుంటూరు జీజీహెచ్ వైద్యులు డాక్టర్ రమ్య, డాక్టర్ వంశీలు పాల్గొన్నారు. సేకరించిన రక్తాన్ని రోగుల అవసరాల కోసం గుంటూరు జీజీహెచ్‌కు పంపుతున్నామని డాక్టర్ అభినయ్ తెలిపారు.

## స్కానింగ్ సేవలు ప్రారంభం

**విశాలాంధ్ర-తాడికొండ :** నియోజక వర్గ కేంద్రమైన తాడి కొండ రూరల్ హెల్త్ సెంటర్‌లో గురువారం స్కానింగ్ సేవలను డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి ప్రారంభించారు. గర్భిణీ స్త్రీల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని స్కానింగ్ సెంటర్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. పీహెచ్సీ, ఆర్‌హెచ్‌సీ, సబ్ సెంటర్ల నుంచి డాక్టర్లు సిఫార్సు చేసిన గర్భిణీ స్త్రీలకు మాత్రమే స్కానింగ్ తీయబడుతుందని తెలిపారు. గర్భిణీ స్త్రీలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రారంభోత్సవంలో డాక్టర్ నళిని దేవి, సీతారామ, రవీంద్ర, శివ బాబు, వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## దళిత వర్గాల అభ్యున్నతే కార్డ్స్ లక్ష్యం

**విశాలాంధ్ర-పిడుగురాళ్ల :** దళిత పేద వర్గాల విద్యా, ఆర్థిక, సామాజిక అభివృద్ధే లక్ష్యంగా కార్డ్స్ సంస్థ డైరెక్టర్ డా. రంజన్ బాబు బాలబాటను స్థాపించారని సంస్థ జాయింట్ డైరెక్టర్ టి.పుష్పలత తెలిపారు. కార్డ్స్ పల్నాడు శాఖ మాచవరం మండల పిల్లుట్ల ఎస్సీ కాలనీలో జరిగిన బాలబాట ఆవిర్భావ దినోత్సవంకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాచవరం మండల ఏసిఓ విజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో పల్నాడు ఇంచార్జి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ తాళ్ళూరి అమర్ నాథ్ మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ కోసం విద్యతో పాటు దళితుల సామాజిక అసమానతలు విద్య ద్వారానే పోతాయన్నారు, బాలబాట ద్వారా గురుకుల పాఠశాలలో విద్యా అవకాశాల కోసం గ్రామాలలో పనిచేస్తున్నామని అన్నారు. ఈ నెల 5 న బాబు జగజ్జీవన్ రామ్ జయంతి నుంచి ప్రారంభించిన ఈ సదస్సుల భాగంలో గురువారం పిల్లుట్లలో నిర్వహించామన్నారు. ఈ సమావేశంలో బాలబాట డిఓ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలపై అవగాహన



**విశాలాంధ్ర-తాడేపల్లి :** వడ్డేశ్వరంలో గురువారం తాడేపల్లి సీఐ కళ్యాణ్ రాజ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలతో కలిసి సీసీ కెమెరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ కళ్యాణ్ రాజు మాట్లాడుతూ నేరాల సంఖ్య తగ్గించడానికి నేరం జరిగిన వెంటనే నేరస్తులను గుర్తించడానికి ఈ సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు.

## మజ్జిగ చలివేంద్రం

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: వేసవి ఉష్ణోగ్రతలు పెరిగిన నేప థ్యంలో విస్సన్నపేటలో దాతలు మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. స్థానిక నూజివీడు రోడ్డు లోని కాకతీయ కమ్మసేవాసమితి కల్యాణమండపం వద్ద ఈ శిబిరం ఏర్పాటు చేశారు. వేసవి వడగాడ్పులు తగ్గే వరకు ఈ శిబిరం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ప్రతిరోజూ దాతల ఆధ్వర్యంలో ప్రధాన రహదారిలో వెళ్లే ప్రయాణీకులకు మజ్జిగ అంద జేయనున్నామన్నారు. ఈ శిబిరంలో గురువారం విజయవాడకు చెందిన సుంకర భీమార్జునరావు కుటుంబసభ్యులు మజ్జిగ సమకూర్చారు.

## రేపు వేదిక్ శ్రీమేధా హై స్కూల్ వార్షికోత్సవం

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలం కూచిపూడి వేదిక్ శ్రీ మేధా ఇంగ్లీషు మీడియం హై స్కూల్ వార్షికోత్సవ వేడుకలు శనివారం నిర్వహిసు న్నట్లు పాఠశాల కరస్పాండెంట్ ఏలేశ్వరపు రాధికాసుబ్రమణ్యం పేర్కొన్నారు 12వ తారీకు సాయంత్రం ఐదు గంటలకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మొవ్వ రోడ్డు సమీపంలోనే ఎస్ఎస్ఎల్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహిస్తు న్నట్లు ఆమె పేర్కొన్నారు. నాట్యాచార్యులు కళా రత్న డాక్టర్ వేదాంతం రాధేశ్యాంతో పాటు న్యాయ, పోలీస్‌శాఖ అధికారులను ఆహ్వానించినట్లు పేర్కొన్నారు.

## ఆశ్రయ్ విశ్రాంతి కేంద్రాల నెట్‌వర్క్‌ను విస్తరించనున్న అమెజాన్ ఇండియా

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఈ సంవత్సరాంతానికి తమ ఆశ్రయ్ కేంద్రాల నెట్‌వర్క్‌ను 100కు విస్తరించేందుకు తగిన ప్రణాళికలను అమెజాన్ ఇండియా ప్రకటించింది. ఈ-కామర్స్, లాజిస్టిక్స్ రంగాల్లోని డెలివరీ అసోసియేట్‌లకు ఎయిర్ కండిషన్డ్ సీటింగ్, శుభ్రమైన తాగునీరు, ఎలక్ట్రో లైట్లు, మొబైల్ ఛార్జింగ్ పాయింట్లు, వాష్‌రూమ్‌లు, ప్రథమ చికిత్స కిట్‌లు, రిఫ్రెష్‌మెంట్ సౌకర్యాలను అందించే ప్రత్యేక విశ్రాంతి కేంద్రాలుగా ఆశ్రయ్ కేంద్రాలుంటాయి. ఆశ్రయ్ కేంద్రాలు వారంలో 7 రోజులు, ఉదయం 9 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు పనిచేస్తాయి. ఏ సమయంలోనైనా 15 మంది వరకు ఇక్కడ విశ్రాంతి తీసుకునే సామర్థ్యంతో సౌకర్యవంతమైన పార్కింగ్ స్థలాలను కూడా అందిస్తాయి.

## మోదుగుల పాపిరెడ్డికి ఇస్కఫ్ సంతాపం

విశాలాంధ్ర-విజయవాడ: ప్రముఖ సోషలిస్టు, న్యాయవాది, ఎమర్జెన్సీ కాలంలో 16 నెలలు రాజమండ్రి జైలులో శిక్ష అనుభవించిన ప్రజా స్వామ్య వాది మోదుగుల పాపిరెడ్డి మృతికి భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్) ప్రగాఢ సంతాపం తెలిపింది. పాపిరెడ్డి కుమారుడు, పార్లమెంట్ మాజీ సభ్యులు, వైఎస్ఆర్‌సీపీ గుంటూరు పార్లమెంటు నియో జకవర్గం కోఆర్డినేటర్ మోదుగుల వేణుగోపాల్ రెడ్డిని గురువారం ఆయన స్వగృహంలో కలిసి ఇస్కఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగి తాల రాజశేఖర్, ప్రముఖ దళిత నాయకుడు నేలపూడి స్టాలిన్‌బాబు సంతా పం తెలిపారు. వున్నారు. సోషలిస్టు భావజాలంతో సమాజ అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన పాపిరెడ్డి మృతి తీరని లోటని, ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కుసుమ సత్యనారాయణ, బద్దా డేవిడ్ బాబు తదితరులు ఉన్నారు.

## అయ్యప్ప భక్తుల బాసట

విశాలాంధ్ర - చల్లపల్లి : శబరిమలైలో అకాల మరణం చెందిన అయ్యప్పదీక్షాపరుడు ఆకుల కుటుంబానికి అయ్యప్ప భక్తులు అండగా నిలిచారు. శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప దేవాలయం అధ్యక్షులు వుప్పాల సుబ్బారావు, ఉపాధ్యక్షుడు యార్లగడ్డ శివయ్య, రావులపల్లి పండు గురుస్వాములు వారి అయ్యప్పపీఠాల పరిధిలోని శిష్యులందరూ కలిపి లక్ష రూపాయల సమీకరించి విజయ్స్వామి కుమార్తె పేరున డిపాజిట్ చేశారు. సదరు ఫిక్సిడ్ డిపాజిట్ బాండ్ను మృతుని భార్యకు అందచేశారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు మత్తి నాగేంద్రం, కస్తూరి వెంకట కోటేశ్వరరావు, బడే శివరామకృష్ణ, లంక ప్రసాద్, బళ్ల మధు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పోషన్ పక్వాడా పక్షోత్సవ వేడుక

విశాలాంధ్ర-ఉయ్యూరు రూరల్: పోషన్ పక్వాడ పక్షోత్సవాల వేడుకలు మండలంలోని గండిగుంట గ్రామంలో గురువారం ఘనంగా జరిగాయి. సందర్భంగా కంకిపాడు ఐసిడిఎస్ సూపర్వైజర్ బేబీ సరోజినీ అంశాలపై తల్లులకు అవగాహన కల్పించారు. గర్భిణీలకు మొదటి వెయ్యి రోజులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ,సంరక్షణ అంశాలపై అవగాహన కల్పించాల న్నారు. లబ్ధిదారులు స్వయంగా తామంతా తామే పోసిన ట్రాకర్లు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అలాగే కమ్యూనిటీ ఆధారిత నిర్వహణ కార్యక్రమాలు సీఎఏఎం అమలు చేయడం ద్వారా పిల్లల పోషణ లోపాలను నివారించవచ్చు అన్నారు.పిల్లల ఉపకాయాన్ని తగ్గించడానికి ఆరోగ్యకరమైన జీవన జీవనశైలి పట్ల తల్లులు అవగాహన కలిగి ఉండాలన్నారు. పలువురు అంగన్వాడి కార్యకర్తలు, పాల్గొన్నారు.

## నిర్ణీత రుసుముతో రెవెన్యూ సేవలు

విశాలాంధ్ర-ఉయ్యూరు : రెవిన్యూ సేవలన్నీ ఇకపై గ్రామ వార్డు సచివాలయం ద్వారా మీ సేవలు ద్వారా నిర్ణీత రుచులు చెల్లించి పొందవచ్చునని ఉయ్యూరు మండల రెవెన్యూ అధికారి హేలా షారెన్ తెలిపారు. అర్జీదారు నిర్ణీత రుసుము చెల్లించి విధిగా రసీదు పొందాలని అంతకుమించి ఎక్కువ సొమ్మును అడిగినట్లయితే ఫిర్యాదు చేయవచ్చుని వెంటనే చర్యలు ఉంటాయని ఆమె తెలిపారు. ఆదాయ ధ్రువీకరణ పత్రం కోసం రు.50 మరణ ధ్రువీకరణ పత్రానికి రు.35 ఆలస్యమైన ప్రతి సంవత్సరానికి రు.5 చెల్లించవలసి ఉంటుందని చెపారు. అలాగే పట్టాదార్ పాస్ పుస్తకానికి రు.150 , అడంగల్ కాపీకి రు. 50 చెల్లించవలసి ఉంటుందన్నారు వ్యవసాయ భూములు సబ్ డివిజన్ రు.550 అడంగల్ నక్కలకు రు.50లు, వ్యవసాయ భూమి విలువ కు 50, ల్యాండ్ కన్వర్షన్కు రు.50 వ్యవసాయ ఆధార ఆదాయ ధ్రువీకరణ పత్రానికి రు.50 చెల్లించవలసి ఉంటుందని చెప్పారు. సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పాల సంఘాల అధ్యక్షులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

విశాలాంధ్ర-తిరువూరు: కృష్ణామిల్క్ యూనియన్ పై చైర్మన్ పై చేస్తున్న కుట్రపూరిత చర్యలను కృష్ణా మిల్క్ యూనియన్ పాడి రైతులు తీవ్రంగా ఖండిస్తున్నారు. గురువారం సంఘ అధ్యక్షులు గద్దె రంగారావు తిరువూరు పోలీస్ స్టేషన్ నందు చలసాని ఆంజనేయులు పై అనుచిత వాక్యాలు, వీడియోలు చేస్తున్న వారిపై ఫిర్యాదు చేయడం జరిగింది.కృష్ణా మిల్క్ యూనియన్ (విజయ డైయిరి)కి చైర్మన్‌గా చలసాని ఆంజనే యులు విజయ డైయిరిని పూర్తినిబద్ధతతో నడుపుతూ అహర్నిశలు పాడి రైతుల ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తూ కృష్ణా మిల్క్ యూనియన్ ను విజయపథం లో నడిపిస్తున్న ఈ తరుణంలో, కొంత మంది వ్యక్తులు అనగా కొడాలి ప్రమీల అనే పేరుతో గుర్తు తెలియని మహిళ తో చైర్మన్ పై తప్పుడు ఆరోపణలు చేయిస్తూ ఒక 9' నిమిషాల వీడియోను రిలీజ్ చేసారు, అంతేకాక కొంతమంది పాలకవర్గ సభ్యులను మరియు ఉద్యోగులను కూడా అందులో యిరికించి, వారు స్త్రీలను అగౌరవ పరిచినట్లుగా కుట్రపూరితంగా అబద్ధపు ఆరోపణలు చేయించి వారి వ్యక్తిగత, కృష్ణామిల్క్ యూనియన్ ప్రతిష్టకు బంగం కలిగే వాఖ్యలు ఉన్నాయన్నారు. ఎవరో కొంతమంది అనుమానస్పద వ్యక్తులు చేస్తూన్నట్లు ఉంది అని అన్నారు.తక్షణమే విడియోలు, పోస్టింగులతో దుష్ప్రచారాలు చేస్తున్న కొడాలి ప్రమీలగా చెప్పుకొనే మహిళ వారికి సహకరించిన వ్యక్తులను గుర్తించి విచారించి వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కంప్లైంట్ ఇవ్వడం జరిగింద.ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు గద్దె రంగారావు, పల్నాటి సత్యనారాయణ, సూరయ్య, శ్రీనివాస రెడ్డి, వెంకటరామిరెడ్డి, బొగ్గుల శ్రీనివాస్ రెడ్డి, గోపాలకృష్ణ, జగన్మోహన్ రావు, శ్రీనివాసరావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ అంటే భారాల జనతా పార్టీ

ఎం సిపిఐ(యు) పార్టీ రాష్ట్ర సహాయ కారదర్శి ఎస్ కె. ఖాదర్ భాష

విశాలాంధ్ర-విజయవాడ (వన్ టౌన్): బీజేపీ అంటే ప్రజల పై అధిక భారాలు మోపే పార్టీ అని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్. ఖాదర్ బాషా అన్నారు. గురువారం విజయవాడ పంజాసెంటర్‌లో పెంచిన వంట గ్యాస్ ధరలను తగ్గించాలని గ్యాస్ బండలను ఎత్తుకొని నిరసన చేశారు. ఖాదర్‌బాషా మాట్లాడుతూ బీజేపీ రూ.32కోట్ల వినియోగదారులపై రూ.9100 కోట్లు భారాన్ని బీజేపీ ప్రజల పై మోపిందన్నారు. అలాగే అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు తగ్గు కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను పెంచిందని అన్నారు. పెంచిన వంట గ్యాస్ ధరలు తగ్గించే వరకు పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు రాచ పూడి బాబూరావు, ఎస్.కే.ఏజాజ్, ఎన్.డీ.వాహెద్, ఎండీ.ఫారుక్, సమద్, అజ్మీ, వానపల్లి గంగాధర్, ఎండీ.ఖమర్, ఖాలీద్, మహిళలు పాల్గొన్నారు.

## డ్రయిన్, మెట్ల నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విజయవాడ 51వ డివిజన్‌లోని పితాని అప్పలస్వామివీధి కొండపైన సుమారు రూ.4లక్షల నిధులతో సైడ్ డ్రెయిన్, మెట్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పశ్చిమ నియోజకవర్గంలో సుజనా చౌదరి సహకారంతో స్థానిక కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ ఆధ్వర్యంలో పనులకు శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే కార్యాలయం ఇన్‌ఛార్జ్ ప్రతిపాటి శ్రీధర్ పాల్గొని స్థానికులతో కలిసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మరుపిళ్ల రాజేష్ మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధికి సహకరిస్తున్న కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఎమ్మెల్యే సుజనా చౌదరి సహకారంతో మరింత అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో జనసేన, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోటీ పరీక్షల పుస్తకాలు బహుకరణ

విశాలాంధ్ర-విజయవాడ ఎడ్యుకేషన్ : విజయవాడ నందు గల ఠాగూర్ స్మారక గ్రంథాలయానికి సాయి సేవ సమితి సభ్యులు గూడూరు నారాయణరావు, మహాలక్ష్మి దంపతులు వారి పెళ్లి రోజు సందర్భంగా పోటీ పరీక్షల పుస్తకాలను బహూకరించారు. విద్యార్థులకు 3000 రూపాయల విలువ చేసే పోటీ పరీక్షలు కావలసిన డీఎస్సీ, పుస్తకాలను రీజనింగ్, అర్థమెటిక్, ఇంగ్లీష్ , జనరల్ స్టడీస్ , మొదలగు పుస్తకాలను ఉచితంగా గ్రంథాలయనికి బహుకరించారు.దాతలు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ కూడా తమ తమ పుట్టిన రోజులు, పెళ్లి రోజుకు ప్రత్యేక రోజులను ఇటువంటి సామాజిక కార్యక్రమాలకి, గ్రంథాలయాల్లో పుస్తకాలు బహూకరించుట కొరకు వినియోగిస్తే బాగుటుంది అని తమ అభిప్రాయం తెలిపారు. గ్రంథ పాలకులు కె.రమాదేవి కె.నాగరాజు లను దుశ్శాలువతో దంపతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాఠకులు, సాయి సేవ సమితి సభ్యులు నాదెండ్ల ఉమాదేవి, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ఫ్రాంక్‌ఫర్ట్ ఉగాది ఉత్సవాలు

విశాలాంధ్ర- విజయవాడ : తెలుగు వెలుగు జర్మనీ సంఘం ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవాలు ఫ్రాంక్‌ఫర్ట్‌లో అంగరంగ వైభవంగా జరిగాయని సంఘం వ్యవస్థాపకుడు సాయిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తెలుగు కుటుంబాలు పాల్గొని, సంగీతం, నృత్యం, సంప్రదాయ ప్రదర్శనలతో ఉత్సవాన్ని ఘనంగా జరిగియని అన్నారు ఈ వేడుకకు ఫ్రాంక్‌ఫర్ట్ బర్గర్‌మాస్టర్ , నసరిన్ ఎస్కందారి-గ్రూన్‌బర్గ్ ముఖ్య అతిథిగా హాజరై, జర్మనీలో తెలుగు సమాజానికి ఉగాది శు భాకాంక్షలు తెలియజేశారు. బహుళసాంస్కృతిక సమాజాన్ని ప్రోత్సహించడ లో ఫ్రాంక్‌ఫర్ట్ నగరం చేస్తున్న కృషికి తెలుగు వెలుగు సంఘం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వెలగా సూర్యప్రకాశ్, ప్రీతం, బొడా విట్టల్, సంఘం కోశాధికారి వంగల ఆదర్ష్ పాల్గొన్నారు.

## అనధికార డంపింగ్ యార్డ్‌లతో ప్రజల అవస్థలు

విశాలాంధ్ర- విజయవాడ లబ్బీపేట : విజయవాడ శివారులో అనధికార డంపింగ్ యార్డ్‌లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నగరానికి అతి సమీపంలోని కానూరు పంచాయతీ పరిధిలో నిత్యం చెత్త డంపింగ్ జరుగుతోంది.. నిత్యం పదుల సంఖ్యలో టిప్పర్ లు ఈ ప్రాంతంలోని ప్రైవేట్ స్థలాలలోనూ, రోడ్ల పైనా వ్యర్థాలను పడేస్తున్నాయి. కొన్నేళ్లుగా సాగుతున్న అక్రమ డంపింగ్‌ను స్థానికులు అడ్డుకున్నారు. వ్యర్థాలతో కూడిన వాహనా లను నిలిపి వేసి అధికారులకు సమాచారమిచ్చారు. సమస్య పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.